STv SAMAYAM

epaper.samayamdaily.net

APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక

తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

7036644111, 9490140565

సంపుటి: 19 | సంచిక: 356 | ఎడిటర్ : అలీ ముర్తుజా | శుక్రవారం 27 నవంబర్ 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 8 | వెల:రూ.5 |

మహిళల హక్కులకు రాజ్యాంగమే రక్షణ

- మహిళలకు సమాన హక్కుల్చింది రాజ్యాంగమే
- హక్కుల అమలులో కొనసాగుతున్న వివక్ష
- మహిళల చరిత్రను వారే రాసుకోవాలి 2
- తెలంగాణ రుద్రమ సేనగా మహిళా విభాగం పేరు మార్పు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత





బండి భగీరథ్‌కు కోర్టు సమన్లు

- జనవరి 28న హాజరుకావాలని ఆదేశం
- మైనర్ బాలిక తల్లి ఫిర్యాదుతో కేసు
- మే 16న అరెస్టు చేసిన పోలీసులు 2
- జూలైలో రెగ్యులర్ బెయిల్ మంజూరు

అక్రమంగా అబార్షన్ కిట్ల విక్రయం

138 మెడికల్ షాపులకు నోటీసులు ■ రాష్ట్రవ్యాప్తంగా టీజీ సేఫ్ తనిఖీలు 2

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రజలు ప్రశ్నించాలి

- ఈవీఎంలపై గెలుపోటములకోతీరు
- రేవంత్, రాహుల్ వ్యాఖ్యల్లో వైరుధ్యం
- రాజ్యాంగ రూపకల్పనలో తెలుగు ప్రముఖులు
- కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ 2



ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం పనితీరును ప్రశంసిస్తూ.. ఓటమి ఎదురైనప్పుడు వాటిపైనే ఆరోపణలు చేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాల్లో విమర్శలు చేస్తుంటే, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని వ్యాఖ్యానించారు.



పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించలేరా?

- ప్రైవేట్ విద్యాసంస్థలో ప్రదర్శనపై అభ్యంతరం
- గతంలో జాతీయ స్థాయి అవార్డులు సాధించాం
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు 3
- యూనిఫాంలు పంపిణీ చేయాలని డిమాండ్

త్వరలో 25వేల ఉద్యోగాలు!



- లక్ష ఉద్యోగాల భర్తీ లక్ష్యంగా ప్రజాప్రభుత్వం
- ఇప్పటికే 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం
- కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరలు
- కొత్తగా 4.89 లక్షల పింఛన్ల పంపిణీకి శ్రీకారం
- పాలమూరు పాలాలను కృష్ణా జలాలతో తడుపుతాం
- అచ్చంపేటలో రూ.450 కోట్ల పనులకు శంకుస్థాపన
- అచ్చంపేట బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి

అచ్చంపేట, నవంబర్ 26 (సమయం న్యూస్): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు సీఎం రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. రానున్న ఏడాది కాలంలో మరో 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి నియామకాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామన్నారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 75 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో ఏడాదిలో లక్ష ఉద్యోగాల భర్తీ లక్ష్యాన్ని పూర్తి చేస్తామని వెల్లడించారు. ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం ప్రసంగించారు. అంతకుముందు అంబేద్కర్ చౌరస్తా నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని సీఎం లాంఛనంగా ప్రారంభించారు.

మిగతా 2 లో



పార్లమెంట్‌లో కీలక ఘట్టానికి తెర!

- ఈ నెల 30న లోక్‌సభ.. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ
- లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచే ప్రతిపాదన?
- ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలో దక్షిణాది రాష్ట్రాలు
- పార్లమెంట్ సమావేశాలపై కాంగ్రెస్ వ్యూహరచన



మొబైల్ ఫోన్లు, మైకులు పట్టుకున్న వారు

జర్నలిస్టులు కాదు

జర్నలిస్టులు, రీల్ క్రియేటర్ల మధ్య తేడాపై సుప్రీం విచారణ 4

రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలి

- బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి
- రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత
- సీఎం రేవంత్‌రెడ్డి
- మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు
- తెలంగాణలో కాంగ్రెస్‌కు 90 అసెంబ్లీ సీట్లే లక్ష్యం 2





సైబరాబాద్ సీపీ, డీసీపీకి జైలు శిక్ష!

ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు రెండు వారాల జైలు 2

వ్యాపారులకు కేంద్రం ఊరట



వ్యాపారులకు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్త అందించింది. ఇకపై జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 4

విద్యుత్ శాఖకు ఏసీబీ షాక్!

- రూ.60 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఏడీఈ ఉద్యోగి 2



కారుకు 38 శాతం.. హస్తానికి 34 శాతం!

- తెలంగాణలో బీఆర్ఎస్‌కు 62, కాంగ్రెస్‌కు 42 స్థానాలు
- ప్రభుత్వానికి రాబోయే రెండేళ్లు కీలకం
- ఓమార్ట్ తాజా సర్వే ఫలితాలు వెల్లడి



2



సైబరాబాద్ సీపీ, డీసీపీకి జైలు శిక్ష!

ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు రెండు వారాల జైలు

ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా

హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): కోర్టు ధిక్కరణ కేసులో ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు తెలంగాణ హైకోర్టు జైలు శిక్ష విధించింది. న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహించినందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ రమేష్ రెడ్డి, మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డికి రెండు వారాల సాధారణ జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.2 వేల చొప్పున జరిమానా విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా మరో వారం రోజులపాటు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఓ భూ వివాదానికి సంబంధించి పిటిషనర్‌కు పోలీసు రక్షణ కల్పించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. అయితే న్యాయస్థానం ఉత్తర్వులను సంబంధిత పోలీసు అధికారులు అమలు చేయలేదంటూ పిటిషనర్ మరోసారి కోర్టును ఆశ్రయించారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన హైకోర్టు పోలీసు ఉన్నతాధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఉత్తర్వుల అమలులో నిర్లక్ష్యాన్ని కోర్టు ధిక్కరణగా పరిగణిస్తూ ఇద్దరు అధికారులకు జైలు శిక్ష విధించింది. అయితే తీర్పును సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు వీలుగా శిక్ష అమలును వారం రోజులపాటు నిలిపివేసింది. ఈ గడువులోగా పైకోర్టు నుంచి శిక్ష అమలు నిలుపుదల ఉత్తర్వులు పొందాలని, లేనిపక్షంలో గడువు ముగిసిన వెంటనే హైకోర్టు రిజిస్ట్రార్ ఎదుట లొంగిపోయి శిక్ష అనుభవించాలని ఆదేశించింది. గతంలోనూ న్యాయస్థానం ఉత్తర్వులను అమలు చేయని పలువురు కలెక్టర్లు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు కోర్టు ధిక్కరణ కింద హైకోర్టు జైలు శిక్షలు విధించిన సందర్భాలున్నాయి. తాజాగా ఇద్దరు పోలీసు ఉన్నతాధికారులకు జైలు శిక్ష విధించడం పోలీసు, అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

బండి భగీరథ్‌కు కోర్టు సమన్లు

మేడ్చల్, నవంబర్ 26 (సమయం న్యూస్): పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌కు మేడ్చల్ జిల్లా ప్రత్యేక పోక్సో న్యాయస్థానం సమన్లు జారీ చేసింది. కేసు విచారణలో భాగంగా వ్యక్తిగతంగా కోర్టుకు హాజరుకావాలని ఆదేశించింది. వచ్చే ఏడాది జనవరి 28న న్యాయస్థానం ఎదుట హాజరుకావాలని స్పష్టం చేసింది. దీంతో కేసు విచారణ తదుపరి దశకు చేరుకుంది. 17 ఏళ్ల బాలికను వేధించడంతో పాటు బలవంతంగా మద్యం తాగించి, శారీరకంగా ఇబ్బందులకు గురిచేశారంటూ బాధితురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో ఈ ఏడాది మే నెలలో పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసులు మే 16న బండి సాయి భగీరథ్‌ను అరెస్టు చేశారు. ఆయనపై పోక్సో చట్టంతో పాటు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఆధారాల ధ్వంసానికి సంబంధించిన ఇతర సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ఈ కేసులో భగీరథ్ 50 రోజులకు పైగా జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. అనంతరం జూలైలో న్యాయస్థానం ఆయనకు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. ప్రస్తుతం మేడ్చల్ ప్రత్యేక పోక్సో కోర్టులో విచారణ కొనసాగుతోంది. తదుపరి న్యాయ ప్రక్రియలో భాగంగా జనవరి 28న ఆయన వ్యక్తిగతంగా హాజరుకావాల్సి ఉంది.

అక్రమంగా అబార్షన్ కిట్ల విక్రయం

138 మెడికల్ షాపులకు నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా టీజీ సేఫ్ తనిఖీలు

హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా గర్భస్రావ మాత్రలు విక్రయిస్తున్న మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకుంటామని టీజీ సేఫ్ కమిషనర్ అవినాష్ మొహంతి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా అబార్షన్ కిట్లు విక్రయిస్తున్న ఫార్మసీలపై డ్రగ్స్ వింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్'లో భాగంగా గురువారం పలు జిల్లాల్లో మెడికల్ షాపుల లావాదేవీల వివరాలను పరిశీలించి ఆకస్మిక సోదాలు చేపట్టారు. ఈ తనిఖీల్లో 138 దుకాణాల్లో తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనలు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డ్రగ్స్ రూల్స్ ప్రకారం షెడ్యూల్ హెచ్ పరిధిలోకి వచ్చే మిఫెప్రిస్టోన్, మిసోప్రోస్టోల్ మాత్రలను రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్ ఇచ్చిన చెల్లుబాటయ్యే ప్రిస్క్రిప్షన్ ఆధారంగానే విక్రయించాలి. అయితే పలు దుకాణాల్లో వైద్యుల చీటీ లేకుండానే ఓవర్ ది కౌంటర్ పద్ధతిలో ఈ మాత్రలను అమ్ముతున్నట్లు అధికారులు గుర్తించారు. కొనుగోలుదారులకు విక్రయ బిల్లులు ఇవ్వకపోవడం, అమ్మకాల రికార్డులు, ప్రిస్క్రిప్షన్ డ్రగ్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి లోపాలు బయటపడ్డాయి. కొన్ని చోట్ల రిజిస్టర్డ్ ఫార్మసిస్ట్ అందుబాటులో లేకుండానే మందులు విక్రయిస్తున్నట్లు తనిఖీ బృందాలు గుర్తించాయి. నిబంధనలు ఉల్లంఘించిన 138 మెడికల్ షాపులపై డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ చట్టం-1940, సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఆయా దుకాణాల డ్రగ్ లైసెన్సులను తాత్కాలికంగా నిలిపివేయడం లేదా శాశ్వతంగా రద్దు చేయడంపై నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. అబార్షన్ కిట్ల అక్రమ సరఫరా, ఇతర మార్గాలకు మళ్లింపును అడ్డుకోవడమే ఈ ప్రత్యేక తనిఖీల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఎంటీపీ చట్టం-2002, నిబంధనలు-2003 ప్రకారం అల్ట్రాసౌండ్ పరీక్షలు, వైద్యపరమైన పరిశీలన అనంతరం ప్రభుత్వ గుర్తింపు పొందిన వైద్య కేంద్రంలో నిపుణులైన గైనకాలజిస్టు పర్యవేక్షణలోనే అబార్షన్ మాత్రలు వాడాలని అధికారులు సూచించారు. ముఖ్యంగా గర్భం గర్భాశయంలో కాకుండా ఫెలోపియన్ ట్యూబ్‌లో ఏర్పడే ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీ సందర్భంలో ఈ మాత్రలు పనిచేయవని వివరించారు. ఇలాంటి పరిస్థితుల్లో ట్యూబ్ పగిలి తీవ్ర అంతర్గత రక్తస్రావం జరిగే ప్రమాదం ఉందని, హైపోవోలెమిక్ షాక్‌కు గురై ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడవచ్చని హెచ్చరించారు. అబార్షన్ కిట్ల అక్రమ విక్రయాలు, పంపిణీకి సంబంధించిన సమాచారం తెలిస్తే కార్యాలయ వేళల్లో 1800-599-6969 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని ప్రజలకు అధికారులు విజ్ఞప్తి చేశారు.

మొదటి పేజీ తరువాయి

దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులకు కొత్తగా 4.89 లక్షల పింఛన్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. అచ్చంపేట నియోజకవర్గంలో దాదాపు రూ.450 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. "నేను ఈ గడ్డపై పుట్టిన బిడ్డను. నల్లమల, అచ్చంపేట నా సొంత ప్రాంతం. ఈ ప్రాంత అభివృద్ధికి సర్వశక్తులూ ఒడ్డి మీ బిడ్డగా రుణం తీర్చుకుంటా" అని సీఎం పేర్కొన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలే తెలంగాణ ఉద్యమ ప్రధాన ఆకాంక్షలని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో పాలమూరు నీటిపారుదల రంగానికి అన్యాయం జరిగిందని, ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అచ్చంపేట ఎత్తిపోతల, డిండి, ఎస్ఎల్బీసీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయిందని విమర్శించారు. అప్పట్లో రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవని అన్నారు. రోజుకు మూడు టీఎంసీల కృష్ణా జలాలను వినియోగించుకునే అవకాశం ఉంటే లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవన్నారు. పాలమూరు జిల్లా బిడ్డగా ఈ ప్రాంత పొలాలను కృష్ణా జలాలతో తడపాల్సిన బాధ్యత తనపై ఉందని స్పష్టం చేశారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఎస్సీ ఉపకులాల వర్గీకరణ ఆకాంక్షను తమ ప్రభుత్వం నెరవేర్చిందని సీఎం తెలిపారు. సమగ్ర కులగణన చేపట్టి ఆయా వర్గాల జనాభా, జీవన ప్రమాణాలకు సంబంధించిన గణాంకాలను సేకరించడం ద్వారా దేశానికి ఆదర్శంగా నిలిచామన్నారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా ఇందిరమ్మ ఇండ్లు, కుటుంబ బీమా, ఇందిరమ్మ చీరలు, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల మేర రుణ అనుసంధానం, 75 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ తమ ప్రభుత్వ విజయాలని పేర్కొన్నారు. గత పదేళ్ల పాలనకు, ప్రస్తుత మూడేళ్ల పాలనకు మధ్య తేడాను ప్రజలు బేరీజు వేసుకోవాలని కోరారు. అప్పులతో సతమతమవుతున్న తెలంగాణను అభివృద్ధి పథంలో నడిపించేందుకు గడిచిన 34 నెలలుగా నిరంతరం శ్రమిస్తున్నామని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీ, కులం ఆధారంగా ఎలాంటి వివక్ష చూపడం లేదని స్పష్టం చేశారు. "పేదవారే మా బంధువులు.. పేదలను ఆదుకోవడమే మా లక్ష్యం. ఇందిరమ్మ వారసత్వంలో నిరుపేదలను గుండెల్లో పెట్టుకుని చూసుకోవాల్సిన బాధ్యత మాపై ఉంది" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు, ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తోపాటు ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

త్వరలో 25వేల ఉద్యోగాలు!



రాజ్యాంగ పరిరక్షణకు ప్రజలంతా పోరాడాలి: సీఎం రేవంత్‌రెడ్డి

- **బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి**
- **రాజ్యాంగాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత**
- **మోడీ సర్కారుపై తీవ్ర విమర్శలు**
- **తెలంగాణలో కాంగ్రెస్‌కు 90 అసెంబ్లీ సీట్లే లక్ష్యం**



హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): భారత రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రజలంతా ఐక్యంగా నిలబడి ఆ కుట్రలను ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన 'సంవిధాన్ రక్షా మార్చ్'లో ఆయన పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నుంచి రాజ్యాంగాన్ని రక్షించడమే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. తాము పాలకులం కాదని, ప్రజలకు సేవకులమన్నారు. నియంతృత్వ పాలన కావాలా.. ప్రజల హక్కుల కోసం నిలబడే నాయకత్వం కావాలా అన్నది ప్రజలే తేల్చుకోవాలన్నారు. అధికారం రాజుల చేతుల్లో కాకుండా ప్రజల చేతుల్లో ఉండాలన్నదే రాజ్యాంగ నిర్మాతల ఆకాంక్ష అని సీఎం పేర్కొన్నారు. పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు జమ చేస్తామని, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి మోడీ అధికారంలోకి వచ్చారని విమర్శించారు. మూడోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు భాష, ప్రాంతాల మధ్య విభేదాలను రెచ్చగొట్టారని ఆరోపించారు. ఎన్నికల్లో ఈడీ, సీబీఐ, ఐటీ వంటి దర్యాప్తు సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకున్నారని విమర్శించారు. నాలుగోసారి కూడా అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ఇప్పుడు రాజ్యాంగ వ్యవస్థలపై దాడికి దిగుతున్నారని ఆరోపించారు. పేదలు, దళితులు, గిరిజనుల ఓటు హక్కును దెబ్బతీసేలా ఓట్ల తొలగింపునకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. ఇప్పటికే 13 కోట్ల ఓట్లను తొలగించారని, మరో ఏడు కోట్ల ఓట్లను తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓటు హక్కును కాలరాసే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. గతంలో బ్రిటిష్ పాలకులు సైమన్ కమిషన్‌ను తీసుకొచ్చిన తరహాలోనే ఇప్పుడు బీజేపీ జ్ఞానేశ్వర్ కమిషన్‌ను తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి విమర్శించారు. నాడు భగత్‌సింగ్ బ్రిటిష్ పాలకులపై పోరాటం సాగిస్తే.. నేడు రాహుల్ గాంధీ రాజ్యాంగ పరిరక్షణ కోసం నాయకత్వం వహిస్తున్నారని అన్నారు. దేశంలో గాంధీ వారసులకు, గాడ్సే వారసులకు మధ్య పోరాటం సాగుతోందని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే తదితరులు పాండవుల పక్షాన నిలిస్తే.. ప్రధాని మోడీ, అమిత్ షా కౌరవుల తరహాలో వ్యవహరిస్తున్నారని వ్యాఖ్యానించారు. గాడ్సే వారసులను ఓడించాలంటే రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి కోటి ఓట్లు సాధించడంతో పాటు 90 అసెంబ్లీ స్థానాలు, 15 పార్లమెంట్ స్థానాల్లో విజయం సాధించేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు.

కారుకు 38 శాతం.. హస్తానికి 34 శాతం!

- **తెలంగాణలో బీఆర్ఎస్‌కు 62, కాంగ్రెస్‌కు 42 స్థానాలు**
- **ప్రభుత్వానికి రాబోయే రెండేళ్లు కీలకం**
- **ఓమార్ట్ తాజా సర్వే ఫలితాలు వెల్లడి**

ఖైరతాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): తెలంగాణలో రాజకీయ పార్టీల బలాబలాలు, ప్రభుత్వ పనితీరు, ప్రజాభిప్రాయంపై నిర్వహించిన తాజా సర్వేలో బీఆర్ఎస్ పార్టీ ముందంజలో ఉన్నట్లు వెల్లడైంది. సర్వే ప్రకారం బీఆర్ఎస్‌కు 38 శాతం ఓటింగ్‌తో 62 అసెంబ్లీ స్థానాలు, కాంగ్రెస్‌కు 34 శాతం ఓటింగ్‌తో 42 స్థానాలు వొచ్చే అవకాశాలున్నాయని ఓమార్ట్ సర్వే సంస్థ ప్రతినిధులు ఆర్. చెన్నయ్య (సీఈఓ), ప్రకాశ్‌రావు (అనలిస్ట్) తెలిపారు. బీజేపీకి ఎనిమిది, ఎంఐఎంకు ఏడు స్థానాలు వొస్తాయని అంచనా వేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఓమార్ట్ సర్వే ప్రతినిధులు మాట్లాడుతూ.. 2023 అసెంబ్లీ ఎన్నికలు, పార్లమెంట్ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయని తెలిపారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో బలహీనపడిన బీఆర్ఎస్ తిరిగి పుంజుకుంటోందని, కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో మద్దతు తగ్గుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయని వివరించారు. కులాల వారీగా రెడ్డి సామాజికవర్గంలో కాంగ్రెస్‌కు మద్దతు ఉండగా, ఎస్సీ మాల వర్గంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోటీ కనిపిస్తోందన్నారు. ఇతర బీసీ, సామాజిక, వృత్తి వర్గాల్లో బీఆర్ఎస్ ఒకటి నుంచి ఐదు శాతం వరకు ఆధిక్యంలో ఉందని పేర్కొన్నారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా నిర్వహించిన సర్వేలో కొన్ని చోట్ల హోరాహోరీ పోటీ ఉండగా, సిద్దిపేట, సిరిసిల్ల వంటి నియోజకవర్గాల్లో బలమైన ఆధిక్యం కనిపించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వానికి రాబోయే రెండేళ్లు కీలకమని, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి ద్వారా ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లోని మూడు ముస్లిం ప్రాబల్య ప్రాంతాల్లో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నామని, త్వరలో ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు. ప్రస్తుత సర్వే ఫలితాలు ఇప్పటి పరిస్థితులకు సంబంధించిన అంచనాలు మాత్రమేనని, ఎన్నికల సమయానికి రాజకీయ సమీకరణాలు మారవచ్చని స్పష్టం చేశారు.





విద్యుత్ శాఖకు ఏసీబీ షాక్!

రూ.60 వేల లంచం తీసుకుంటూ

ఏసీబీకి చిక్కిన ఏడీఈ ఉద్యోగి

గద్వాల, నవంబర్ 26 (సమయం న్యూస్): అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో గద్వాల పట్టణంలోని అడిషనల్ డివిజనల్ ఇంజినీరింగ్ (ఏడీఈ) కార్యాలయ ఉద్యోగి రమేష్‌బాబు పట్టుబడినట్లు సమాచారం. కృష్ణా రోడ్డులోని కార్యాలయంలో ఆయన రూ.60 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు ట్రాప్ చేసి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టేందుకు ఏసీబీ చేపడుతున్న చర్యల్లో భాగంగా ఈ ఘటన చోటుచేసుకుంది. లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారులు దాడి చేయడంతో సంబంధిత కార్యాలయంలో కలకలం రేగింది. ఏ పనికి సంబంధించి రమేష్‌బాబు నగదు డిమాండ్ చేశారు? ఎవరి నుంచి లంచం తీసుకుంటున్నారు? అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ఘటనపై ఏసీబీ అధికారులు తదుపరి విచారణ కొనసాగిస్తున్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు, అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

మహిళల హక్కులకు రాజ్యాంగమే రక్షణ

- మహిళలకు సమాన హక్కులిచ్చింది రాజ్యాంగమే
- హక్కుల అమలులో కొనసాగుతున్న వివక్ష
- మహిళల చరిత్రను వారే రాసుకోవాలి
- తెలంగాణ రుద్రమ సేనగా మహిళా విభాగం పేరు మార్పు
- తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): మహిళలకు సమాన హక్కులు, స్వేచ్ఛ కల్పించింది భారత రాజ్యాంగమేనని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న నవంబర్ 26 మహిళలకు నిజమైన పండుగ రోజని పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఆర్ఎస్ నిర్వహించిన 'మహిళలు-రాజ్యాంగం' సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలకు ఓటు హక్కుతో పాటు సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగాన్ని యథాతథంగా అమలు చేస్తే వారి సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. మహిళలు ఉద్యోగాలు చేస్తున్నా పురుషులతో సమానంగా వేతనాలు, ఆస్తి హక్కులు పొందలేకపోతున్నారని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కులం, మతంతో సంబంధం లేకుండా అన్ని వర్గాల మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సాయుధ రైతాంగ పోరాటం సహా అనేక ఉద్యమాల్లో మహిళలు కీలక పాత్ర పోషించినప్పటికీ చరిత్రలో వారికి తగిన గుర్తింపు దక్కలేదన్నారు. మహిళలు తమ పోరాట చరిత్రను తామే రాసుకోవాలని పిలుపునిచ్చారు. మహిళలపై అవమానాలు, దాడులు ఇప్పటికీ కొనసాగుతున్నాయని విమర్శించారు. సావిత్రిబాయి పూలే నాటి నుంచి నేటి వరకు మహిళలు ఎదుర్కొంటున్న వివక్షలో ఆశించిన మార్పు రాలేదన్నారు. ప్రేమను నిరాకరించిందనే కారణంతో విద్యార్థినిపై దాడి, హాస్టల్‌లో విద్యార్థిని ప్రసవించిన ఘటనలను ప్రస్తావిస్తూ మహిళల భద్రతపై ప్రభుత్వాలు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగానికి 'తెలంగాణ రుద్రమ సేన'గా పేరు మారుస్తున్నట్లు కవిత ప్రకటించారు. ఈ మేరకు మహిళా నాయకులతో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించారు. రుద్రమదేవి స్ఫూర్తితో మహిళలు తమ హక్కుల కోసం పోరాడాలని, ప్రతి ఇంటికీ వెళ్లి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు అంబేద్కర్, గాంధీ, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు నివాళులర్పించారు

కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రజలు ప్రశ్నించాలి

- ఈవీఎంలపై గెలుపోటములకో తీరు
- రేవంత్, రాహుల్ వ్యాఖ్యల్లో వైరుధ్యం
- రాజ్యాంగ రూపకల్పనలో తెలుగు ప్రముఖులు
- కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్




హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): ఎన్నికల్లో గెలిచినప్పుడు ఈవీఎంలు, ఎన్నికల సంఘం పనితీరును ప్రశంసిస్తూ.. ఓటమి ఎదురైనప్పుడు వాటిపైనే ఆరోపణలు చేయడం కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని కేంద్ర మాజీ మంత్రి అనురాగ్ సింగ్ ఠాకూర్ విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశాల్లో విమర్శలు చేస్తుంటే, 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెబుతున్నారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ నేతల మాటల్లోని ఈ వైరుధ్యాన్ని ప్రజలు గమనించాలని, రాబోయే ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన సమాధానం చెబుతారని అన్నారు. బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన సంవిధాన్ సమ్మాన్ దివస్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారత రాజ్యాంగం 1949 నవంబర్ 26న ఆమోదం పొందగా, 1950 జనవరి 26 నుంచి అమల్లోకి వచ్చిందని ఠాకూర్ గుర్తుచేశారు. రాజ్యాంగ రూపకల్పనలో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, పట్టాభి సీతారామయ్య, టంగుటూరి ప్రకాశం, ఎన్.జి. రంగా, దుర్గాబాయి దేశ్‌ముఖ్ వంటి తెలుగు ప్రముఖులు విశేష కృషి చేశారని పేర్కొన్నారు. నిజాం పాలన నుంచి విముక్తి అనంతరం 1948 సెప్టెంబర్ 17న సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ కృషితో హైదరాబాద్ భారతదేశంలో విలీనమైందని చెప్పారు. ఈ చారిత్రక నేపథ్యం కారణంగా ఒకే దేశం, ఒకే రాజ్యాంగం ప్రాధాన్యం హైదరాబాద్ ప్రజలకు బాగా తెలుసని అన్నారు. అంబేద్కర్ 125వ జయంతి సందర్భంగా 2015లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నవంబర్ 26ను రాజ్యాంగ దినోత్సవంగా ప్రకటించారని ఠాకూర్ తెలిపారు. అంబేద్కర్ జీవితంతో సంబంధం ఉన్న ఐదు ప్రాంతాలను బీజేపీ ప్రభుత్వం 'పంచ తీర్థాలు'గా అభివృద్ధి చేసిందని వివరించారు. రాజ్యాంగ పీఠిక, ప్రాథమిక హక్కులు, విధులు, ఓటు హక్కుపై ప్రతి పౌరుడికి అవగాహన ఉండాలని సూచించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, ఆర్టికల్ 370 రద్దు, బీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించడం వంటి చర్యలను తమ ప్రభుత్వం చేపట్టిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ గత పాలనపైనా అనురాగ్ ఠాకూర్ విమర్శలు చేశారు. అంబేద్కర్‌ను ఎన్నికల్లో ఓడించడంతో పాటు, ఆయనకు భారతరత్న పురస్కారం ఇవ్వకుండా దశాబ్దాల పాటు జాప్యం చేసిందని ఆరోపించారు. 1975లో ఎమర్జెన్సీ విధించి, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ మౌలిక స్ఫూర్తిని మార్చేందుకు ప్రయత్నించిందని విమర్శించారు. ఆ సమయంలో స్నేహలతా రెడ్డి వంటి పోరాట యోధులను జైలులో నిర్బంధించారని అన్నారు. ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి 90కిపైగా ప్రభుత్వాలను కూల్చివేసిందని, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల నియామకాల్లో సీనియారిటీని కూడా పట్టించుకోలేదని ఆరోపించారు. 1984 సిక్కుల ఊచకోతతో పాటు, సొంత పార్టీ నేతలైన పీవీ నరసింహారావు, సీతారాం కేసరిల పట్ల వ్యవహరించిన తీరుపై కాంగ్రెస్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగాలపై ప్రశ్నిస్తే దాడులు చేస్తారా?

- బావర్చి ఘటనపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం
- బీఆర్ఎస్ యువ నాయకులపై దాడిని ఖండించిన కేటీఆర్
- రాజ్యాంగ దినోత్సవం రోజునే ప్రజాస్వామ్య హక్కులపై దాడి
- నిరసన తెలిపే హక్కు లేదా?.. రాహుల్ గాంధీకి ప్రశ్న
- దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలకు డిమాండ్



హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): నిరుద్యోగులకు రెండు లక్షల ఉద్యోగాల హామీని అమలు చేయాలని ప్రశ్నిస్తే దాడులు చేస్తారా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని బావర్చి హోటల్ వద్ద నిరసన తెలిపిన బీఆర్ఎస్ యువ నాయకులపై కాంగ్రెస్ నాయకులు, వారి అనుచరులు దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు ప్రతిపక్షాలకు ఉందని, ఆ గొంతులను అణచివేయాలని చూడటం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. రాజ్యాంగ దినోత్సవం రోజునే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. మూడేళ్ల క్రితం బావర్చి హోటల్‌లో బిర్యానీ తింటూ తెలంగాణ యువతకు రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని కేటీఆర్ గుర్తుచేశారు. ఆ హామీని గుర్తుచేస్తూ మన్నె క్రిశాంక్ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ చిత్రపటంతో భోజన కార్యక్రమం నిర్వహించడం తప్పా? అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా మన్నె క్రిశాంక్, ముఠా జైసింహ, జగన్ పాటిమీది, దినేశ్ చౌదరి, విష్ణువర్ధన్ రెడ్డి, హరీశ్ రెడ్డిలపై దాడి జరిగిందని తెలిపారు. స్వయంగా ఓ రాజ్యసభ సభ్యుడే తన అనుచరులతో కలిసి దాడికి నాయకత్వం వహించారని ఆరోపించారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగానూ కేటీఆర్ స్పందించారు. రాజ్యాంగం కల్పించిన నిరసన తెలిపే హక్కు, ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు గురించి రాహుల్ గాంధీ తన పార్టీ నాయకులకు గుర్తుచేయాలని సూచించారు. ఎన్నికల హామీలను గుర్తుచేస్తే హింసతో సమాధానం చెప్పడం ఏమిటని నిలదీశారు. రాజ్యాంగ విలువల గురించి మాట్లాడే కాంగ్రెస్ వాటిని ఆచరణలో కాపాడాలని హితవు పలికారు. బావర్చి ఘటనకు రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని, దాడికి పాల్పడిన వారితోపాటు దానికి నాయకత్వం వహించిన వారిపైనా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, బావర్చి హోటల్ వద్ద బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టిన సమయంలో ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, అరవింద్ యాదవ్ తమ అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం, ఘర్షణ చోటుచేసుకున్నట్లు సమాచారం. ఈ క్రమంలో ఓ కారుపైనా దాడి జరిగినట్లు తెలిసింది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేసినట్లు సమాచారం.





ప్రభుత్వ పాఠశాలలో సైన్స్ ఫేర్ నిర్వహించలేరా?

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు

పైవేట్ విద్యాసంస్థలో ప్రదర్శనపై అభ్యంతరం

సిద్దిపేట, నవంబర్ 26 (సమయం న్యూస్): జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహణకు ప్రైవేట్ విద్యాసంస్థను వేదికగా ఎంపిక చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించాల్సిన సైన్స్ ఫేర్‌ను ప్రైవేట్ విద్యాసంస్థలో ఏర్పాటు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. కనీసం ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించాల్సిన వైజ్ఞానిక ప్రదర్శనను కూడా అదే పాఠశాలలో జరిపే పరిస్థితి లేదా? అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో సిద్దిపేట విద్యార్థులు సైన్స్ ఫేర్‌లో జాతీయ స్థాయి అవార్డులు సాధించారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం వైజ్ఞానిక ప్రదర్శనల నిర్వహణ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సిద్దిపేటపై వివక్షతోనే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. విద్యార్థుల సంక్షేమ పథకాల అమలులోనూ ప్రభుత్వం అలసత్వం ప్రదర్శిస్తోందన్నారు. సిద్దిపేటలో విద్యార్థులకు అందించాల్సిన బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. విద్యా సంవత్సరం సగం పూర్తవుతున్నా ఇప్పటివరకు ఒక్క జత యూనిఫాం మాత్ర మే పంపిణీ చేశారన్నారు. విద్యార్థులకు మిగిలిన యూనిఫాంలను వెంటనే అందించాలని, బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని పూర్తిస్థాయిలో ప్రారంభించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

రేవంత్ భ్రమల్లో బతుకుతున్నారు

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటమి తప్పదు

బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ విమర్శలు



హుజూరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భ్రమల్లో జీవిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ఆయనకు ఓటమి తప్పదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ వ్యాఖ్యానించారు. గురువారం కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో పర్యటించిన ఆయన పలు స్థానిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరుపై విమర్శలు గుప్పించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 90 శాతం సీట్లు వస్తాయనే అంచనాలో రేవంత్‌రెడ్డి ఉన్నారని ఈటల ఎద్దేవా చేశారు. వాస్తవానికి రాష్ట్రంలో ప్రజా సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాబోయే 10 నుంచి 15 ఏళ్ల వరకు కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వచ్చే పరిస్థితి లేదని ఆ పార్టీ కార్యకర్తలే చెబుతున్నారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి వంద శాతం ఓడిపోవడం ఖాయమని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యలేమిటో వెల్లడించాలని ఈటల డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో చోటుచేసుకున్న అవినీతిపై చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

వివాహేతర సంబంధం.. భర్తను హత్య చేసిన భార్య

ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు



వెంకటాపురం, నవంబర్ 26: వివాహేతర సంబంధం ఓ కుటుంబంలో విషాదాన్ని నింపింది. తన సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన ఓ మహిళ.. ప్రియుడు, మరో వ్యక్తి సాయంతో భర్తను హత్య చేసిన ఘటన ములుగు జిల్లా వెంకటాపురం (నూగూరు) మండల కేంద్రంలోని బీసీ మర్రిగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కాలనీలో నివాసముంటున్న పూనెం నాగరాజుకు జ్యోతితో వివాహమైంది. కొంతకాలంగా వీరు అక్కడే ఉంటున్నారు. ఈ క్రమంలో జ్యోతికి బెస్తగూడెం గ్రామానికి చెందిన గుండారపు సత్యంతో పరిచయం ఏర్పడి, అది వివాహేతర సంబంధానికి దారితీసింది. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు పలుమార్లు భార్యను హెచ్చరించినా ఆమె వైఖరిలో మార్పు రాలేదు. తమ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన జ్యోతి, సత్యంతో కలిసి నాగరాజును హతమార్చేందుకు పథకం వేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా బుధవారం రాత్రి సత్యం, ప్రశాంత్ అనే మరో వ్యక్తి సహకారంతో నాగరాజు గొంతు నులిమి హత్య చేసినట్లు తెలుస్తోంది. అనంతరం ఘటనను ఆత్మహత్యగా నమ్మించేందుకు ఇంట్లోనే మృతదేహాన్ని ఉరివేసినట్లు సమాచారం. నాగరాజు మృతిపై అనుమానం వ్యక్తం చేసిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు హత్య కోణాన్ని గుర్తించి అసలు విషయాన్ని వెలుగులోకి తెచ్చారు. పోలీసుల విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించినట్లు తెలిసింది. ఈ ఘటనలో పాల్గొన్న జ్యోతి, సత్యం, ప్రశాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విషాదం అలుముకుంది

సంపాదకీయం



ట్రంప్ 25 శాతం టారిఫ్స్ వార్నింగ్

భారత 'మేకిన్ ఇండియా'కు సవాళ్లు..!

భారత్‌పై 25 శాతం సుంకాలు విధించనున్నట్లు ట్రంప్ సర్కారు చేసిన హెచ్చరికలు భారత మేకిన్ ఇండియా ప్రక్రియకు సవాల్‌గా మారాయి. ప్రపంచ తయారీ కేంద్రంగా మారాలన్న భారతదేశ ఆశయానికి ఈ టారిఫ్ భయాలు అడ్డంకి మారాయి. ప్రపంచ సరఫరా గొలుసులను చైనాకు దూరం చేయడం గురించి పదేపదే మాట్లాడుతున్న అమెరికా.. ఇప్పుడు భారత్ తన తయారీ రంగాన్ని నిర్మించుకోవడానికి అనుసరిస్తున్న కొన్ని విధానాలను కూడా ప్రశ్నిస్తున్నది. అంతర్జాతీయ వాణిజ్య సమీకరణాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్న వేళ, అమెరికా తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు భారతీయ పారిశ్రామిక రంగానికి కొత్త పరీక్షగా నిలుస్తున్నాయి.

'మేక్ ఇన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్', 'ప్రొడక్షన్ లింక్డ్ ఇన్సెంటివ్' వంటి కార్యక్రమాలపై డొనాల్డ్ ట్రంప్ సర్కారు కన్నేసింది. ప్రభుత్వ మద్దతుతో జరిగే తయారీరంగ విస్తరణ దేశీయ మార్కెట్‌కు అవసరమైన దానికంటే ఎక్కువ ఉత్పత్తి సామర్థ్యాన్ని సృష్టిస్తుందని, ఇది భారతీయ కంపెనీలు తమ మిగులు ఉత్పత్తులను విదేశాలకు అమ్ముకునేలా చేసి అమెరికన్ తయారీదారులపై ఒత్తిడిని పెంచుతుందని అగ్రరాజ్యం వాదిస్తున్నది. స్వదేశీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, రాయితీలు, ఆర్థిక మద్దతు విధానాల వల్ల ప్రపంచ మార్కెట్‌లో అసమాన పోటీ తలెత్తుతోందన్న అభిప్రాయాన్ని అమెరికా యంత్రాంగం బలంగా వినిపిస్తోంది. తయారీ సామర్థ్యం, ఉత్పత్తికి సంబంధించి భారతదేశ విధానాలు అసమంజసంగా ఉన్నాయని, అమెరికా వాణిజ్యాన్ని పరిమితం చేస్తున్నాయని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ (యూఎస్‌టీఆర్) నిర్ధారించింది. కొన్ని ఉత్పత్తులకు మినహాయింపులతో ఇప్పటికే ఉన్న సెక్షన్ 301 సుంకాలకు అదనంగా భారతీయ వస్తువులపై 25 శాతం వరకు అదనపు సుంకాలను విధించాలని యూఎస్‌టీఆర్ ప్రతిపాదించింది. అయితే ఒక వెసులుబాటు ఉండే అవకాశం ఉంది. విచారణలో లేవనెత్తిన ఆందోళనలను పరిష్కరించేలా భారత్, వాషింగ్టన్ మధ్య ఏదైనా వాణిజ్య ఒప్పందం కుదిరితే, ప్రతిపాదిత రేటును 17 శాతానికి సర్దుబాటు చేయవచ్చు. ఇరుదేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక చర్చలు, సయోధ్య ప్రయత్నాల ఫలితంగా సుంకాల భారాన్ని కొంతమేర తగ్గించుకునే అవకాశం ఉన్నప్పటికీ, ప్రాథమికంగా ప్రకటించిన 25 శాతం ప్రతిపాదన ఎగుమతిదారుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. భారతీయ తయారీ రంగంలో కీలక రంగాలైన ఎలక్ట్రానిక్స్, ఇంజినీరింగ్ వస్తువులు, ఆటోమొబైల్ విడిభాగాలు, రసాయనాలు, టెక్స్‌టైల్స్ వంటి రంగాలపై అమెరికా సుంకాల ప్రభావం పడే అవకాశం ఉందని వాణిజ్య విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ హెచ్చుతగ్గులు, రవాణా ఖర్చుల ఒత్తిడుల మధ్య పనిచేస్తున్న భారతీయ సంస్థలకు అదనపు పన్నుల భారం తోడైతే అమెరికా మార్కెట్‌లో ధరల పోటీని తట్టుకోవడం కష్టతరమవుతుందని అంచనా వేస్తున్నారు. మరోవైపు, చైనా నుంచి సరఫరా గొలుసులను వైవిధ్యపరచాలనే ఆలోచనలో ఉన్న విదేశీ సంస్థలు భారత్ వైపు మొగ్గు చూపుతున్న తరుణంలో, టారిఫ్ అనిశ్చితి పెట్టుబడి నిర్ణయాల వేగంపై ప్రభావం చూపే అవకాశం ఉందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి. పన్ను వివాదాల నిర్వహణ నిపుణుడు మనోజ్ మిశ్రా.. యూఎస్‌టీఆర్ ప్రతిపాదన భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతుందని తెలిపారు. 'ఇప్పటికే ఉన్న సెక్షన్ 301 సుంకాలను మినహాయించి, కొన్ని మినహాయింపులకు లోబడి, భారతీయ వస్తువులపై 25 శాతం వరకు సుంకాలను విధించాలన్న అమెరికా ప్రతిపాదన భారత్-అమెరికా వాణిజ్య సంబంధాల చుట్టూ ఉన్న అనిశ్చితిని మరింత పెంచుతుంది. 'మేక్ ఇన్ ఇండియా', 'పిఎల్ఐ'తో సహా భారతదేశపు కీలక పారిశ్రామిక కార్యక్రమాలు యూఎస్‌టీఆర్ పరిశీలనలోకి వస్తున్న తరుణంలో ఈ ప్రతిపాదిత చర్యలు భారతదేశపు ఎగుమతి పోటీతత్వాన్ని బలహీనపరిచి, లాభాల మార్జిన్‌లపై ఒత్తిడిని పెంచి, తయారీ రంగ పెట్టుబడులను నిరుత్సాహపుస్తాయి' అని అన్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో భారత వాణిజ్య, పరిశ్రమల వర్గాలు, విధాన నిర్ణేతలు అమెరికా వాణిజ్య ప్రతినిధి కార్యాలయం లేవనెత్తిన అంశాలపై లోతుగా విశ్లేషించి, చర్చల ద్వారా పరిష్కార మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఏర్పడింది. స్వదేశీ తయారీ రంగాన్ని బలోపేతం చేస్తూనే, అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలు, భాగస్వామ్య దేశాల ఆందోళనలకు సమతుల్యంగా స్పందించడం ద్వారా దీర్ఘకాలికంగా 'మేక్ ఇన్ ఇండియా' లక్ష్యాలను సాధించాలని నిపుణులు సూచిస్తున్నారు. వాణిజ్య ఒప్పంద చర్చల్లో స్పష్టత వచ్చే వరకు ఎగుమతి సంస్థలు, తయారీదారులు అప్రమత్తంగా వ్యవహరిస్తూ ప్రత్యామ్నాయ మార్కెట్లు, వ్యూహాలపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది.



పార్లమెంట్‌లో కీలక ఘట్టానికి తెర!

- ఈ నెల 30న లోక్‌సభ.. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశాలు
- డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజనపై ఉత్కంఠ
- లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచే ప్రతిపాదన?
- ప్రాతినిధ్యం తగ్గుతుందనే ఆందోళనలో దక్షిణాది రాష్ట్రాలు
- పార్లమెంట్ సమావేశాలపై కాంగ్రెస్ వ్యూహరచన



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): పార్లమెంట్ ఉభయ సభలను తిరిగి సమావేశపరచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నెల 30న లోక్‌సభను, డిసెంబర్ 2న రాజ్యసభను సమావేశపరచాలని కోరినట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు వెల్లడించారు. డిసెంబర్ 3 వరకు సభా కార్యకలాపాలు కొనసాగించే అవకాశముందని తెలిపారు. ఇవి కొత్త సమావేశాలు కాదని, గత వర్షాకాల సమావేశాల కొనసాగింపుగానే పరిగణించనున్నట్లు స్పష్టం చేశారు. కీలకమైన ప్రభుత్వ కార్యకలాపాలను పూర్తి చేయడమే ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. అయితే సమావేశాల పూర్తి కార్యాచరణను ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదు. ప్రతిపక్షాల నిరసనలు, ఆందోళనల నేపథ్యంలో గత ఆగస్టు 13న పార్లమెంట్ ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి. అయితే వర్షాకాల సమావేశాలను అధికారికంగా ముగించకపోవడంపై రాజకీయ వివాదం నెలకొంది. నియోజకవర్గాల పునర్విభజన కోసమే శీతాకాల సమావేశాలను కేంద్రం ఆలస్యం చేస్తోందని ప్రతిపక్షాలు ఆరోపించాయి. రాజ్యాంగ నిబంధనలకు అనుగుణంగానే ప్రభుత్వం వ్యవహరిస్తోందని అధికార ఎన్డీఏ ఈ ఆరోపణలను ఖండించింది. తాజా సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్లకు సంబంధించిన రాజ్యాంగ సవరణను కేంద్రం ప్రవేశపెట్టే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను గరిష్ఠంగా 850 వరకు పెంచే ప్రతిపాదన పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. 2029 లోక్‌సభ ఎన్నికలకు ముందే లోక్‌సభతోపాటు రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్రం ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన చేపడితే లోక్‌సభలో తమ ప్రాతినిధ్య వాటా తగ్గిపోయే ప్రమాదముందని దక్షిణాది రాష్ట్రాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలను 50 శాతం చొప్పున పెంచే ప్రత్యామ్నాయాన్ని కేంద్రం పరిశీలిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 1971 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రాల మధ్య కొనసాగుతున్న ప్రస్తుత సీట్ల పంపిణీ నిష్పత్తిని యథాతథంగా కొనసాగించే అంశం కూడా పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అయితే ఈ ప్రతిపాదనలపై కేంద్రం ఇంకా తుది నిర్ణయం ప్రకటించలేదు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ వ్యూహరచనకు సిద్ధమైంది. శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఢిల్లీలో కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ బృందం సమావేశం కానుంది. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియా గాంధీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పార్లమెంట్‌లో లేవనెత్తాల్సిన అంశాలు, ప్రభుత్వాన్ని ప్రశ్నించాల్సిన విషయాలు, పార్టీ అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించనున్నారు. మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక అంశాలపై కేంద్రం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనే ఉత్కంఠ రాజకీయ వర్గాల్లో నెలకొంది.

మొబైల్ ఫోన్లు, మైకులు పట్టుకున్న వారు
జర్నలిస్టులు కాదు..

జర్నలిస్టులు, రీల్ క్రియేటర్ల మధ్య తేడాపై సుప్రీం విచారణ..

వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులకు భద్రతపై దృష్టి

జర్నలిస్టులపై దాడుల ఆరోపణల విచారణకు ఉన్నతస్థాయి కమిటీ



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): మొబైల్ ఫోన్, మైక్ పట్టుకున్న ప్రతి ఒక్కరినీ జర్నలిస్టుగా పరిగణించాలా? వృత్తిపరమైన జర్నలిస్టులకు, సామాజిక మాధ్యమాల్లో వీడియోలు రూపొందించే వారికి మధ్య తేడాలను ఎలా గుర్తించాలి? అనే కీలక అంశాలపై సుప్రీంకోర్టు దృష్టి సారించింది. జర్నలిస్టుల చట్టపరమైన గుర్తింపు, వార్తా సేకరణ సమయంలో వారికి కల్పించాల్సిన రక్షణకు సంబంధించిన అంశాలపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఢిల్లీలో అక్టోబర్ 10, 11 తేదీల్లో జరిగిన నిరసనల సందర్భంగా ఏడుగురు జర్నలిస్టులను నిర్బంధించడంతోపాటు వారిపై దాడి చేసి, వార్తా సేకరణకు ఆటంకం కలిగించారనే ఆరోపణల నేపథ్యంలో ఈ విచారణకు ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ ఘటనపై ఢిల్లీ జర్నలిస్టుల యూనియన్, కేరళ వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్, స్వతంత్ర జర్నలిస్టు పరంజోయ్ గుహా ఠాకుర్తా తదితరులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దాడుల ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని సర్వోన్నత న్యాయస్థానం ఏర్పాటు చేసింది. నిరసనలు, భారీ ప్రదర్శనలు, జనసమూహాల మధ్య వార్తలు సేకరించే జర్నలిస్టులకు పోలీసులు, ఇతర అధికారుల నుంచి ఎలాంటి రక్షణ కల్పించాలనే అంశాన్ని పరిశీలించనున్నట్లు జస్టిస్ జయమాల్య బాగ్చి పేర్కొన్నారు. వార్తా సేకరణ సమయంలో జర్నలిస్టులను అనవసరంగా నిర్బంధించడం, దాడులకు పాల్పడటం, విధులకు ఆటంకం కలిగించడం వంటి ఘటనల నివారణపై న్యాయస్థానం దృష్టి సారించింది. అయితే జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించడం అంటే చట్టం నుంచి మినహాయింపు ఇవ్వడం కాదని, పోలీసుల చట్టబద్ధమైన ఆదేశాలను వారు కూడా పాటించాల్సిందేనని ధర్మాసనం స్పష్టం చేసింది. ప్రభుత్వ గుర్తింపు పొందిన జర్నలిస్టులు, నమోదిత మీడియా సంస్థల్లో పనిచేసే పాత్రికేయులు, స్వతంత్ర జర్నలిస్టులతోపాటు సామాజిక మాధ్యమాల్లో సమాచారాన్ని అందించే వారికి ఒకే తరహా భద్రతా నిబంధనలు వర్తింపజేయాలా? లేక వృత్తిపరమైన జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ కల్పించాలా? అనే అంశం విచారణలో కీలకంగా మారింది. మరోవైపు సామాజిక మాధ్యమ ప్రభావకర్తలు, రీల్ క్రియేటర్లను వృత్తిపరమైన జర్నలిస్టుల నుంచి వేరుగా గుర్తించాలని ఢిల్లీ పోలీసులు సుప్రీంకోర్టులో వాదించారు. ప్రస్తుతం ప్రతి ఒక్కరి చేతిలో మొబైల్ ఫోన్లు, మైకులు ఉంటుండటంతో వార్తలు సేకరించే జర్నలిస్టులకు, నిరసనల్లో పాల్గొనే వ్యక్తులకు మధ్య తేడాను గుర్తించడం కష్టంగా మారిందని పేర్కొన్నారు. వృత్తిపరమైన జర్నలిస్టులకు మాత్రమే ప్రత్యేక భద్రతా నిబంధనలు వర్తింపజేయాలని కోరారు. అరెస్టయిన తర్వాత తాము జర్నలిస్టులమని చెప్పుకునే వారికి ప్రత్యేక రక్షణ కల్పించకూడదని వాదించారు. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు, హక్కులు, భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు ఎలాంటి మార్గదర్శకాలు రూపొందిస్తుందనే ఆసక్తి మీడియా వర్గాల్లో నెలకొంది.

వ్యాపారులకు కేంద్రం ఊరట

ఇక క్షణాల్లో జీఎస్టీ రిజిస్ట్రేషన్ రద్దు..



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): వ్యాపారులకు, పన్ను చెల్లింపుదారులకు కేంద్ర ప్రభుత్వం ఒక గొప్ప శుభవార్త అందించింది. ఇకపై జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేదు. 2026, డిసెంబర్ 1వ తేదీ నుంచి ఈ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్‌లోనే చేసుకునేలా కేంద్ర ఆర్థిక శాఖ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ఇందుకోసం 2017 నాటి జీఎస్టీ నియమాలలో కీలక మార్పులు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త నిబంధనల ప్రకారం ఎవరైనా తమ జీఎస్టీ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసుకోవాలనుకుంటే, ముందుగా తమ చివరి పన్ను కాలానికి సంబంధించిన రిటర్నులను దాఖలు చేయాలి. అలాగే ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, ఇతర బకాయిలన్నీ పూర్తిగా చెల్లించాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా రద్దు కోసం దరఖాస్తు చేసుకుంటే, అధికారుల ప్రమేయం లేకుండానే నేరుగా పోర్టల్ ద్వారానే రిజిస్ట్రేషన్ రద్దు అవుతుంది. దరఖాస్తులో పేర్కొన్న తేదీ నుంచే ఈ రద్దు అమల్లోకి వస్తుంది. దీనికి సంబంధించిన సమాచారాన్ని పన్ను చెల్లింపుదారులకు 'ఫామ్ జీఎస్టీ ఆర్ఈజీ-38' ద్వారా ఆన్‌లైన్‌లోనే పంపిస్తారు. ఒకవేళ దరఖాస్తుదారుడు తమ రిటర్నులను సరిగ్గా దాఖలు చేయకపోయినా, లేదా ప్రభుత్వానికి కట్టాల్సిన పన్నులు, వడ్డీలు, జరిమానాలు ఏవైనా బాకీ ఉన్నా ఆ దరఖాస్తు ఆటోమేటిక్‌గా రద్దు కాదు. అలాంటి దరఖాస్తులు సంబంధిత అధికారి పరిశీలనకు వెళ్తాయి. అన్ని బకాయిలు క్లియర్ చేస్తేనే సులభంగా ఆన్‌లైన్‌లో పని పూర్తవుతుంది. కొత్తగా జీఎస్టీ రిజిస్ట్రేషన్ చేసుకునే వారి కోసం కూడా ప్రభుత్వం పోర్టల్‌లో మరిన్ని మార్పులు చేసింది. దరఖాస్తు ఫామ్ నింపేటప్పుడు ఎలాంటి తప్పులు జరగకుండా ఎప్పటికప్పుడు సూచనలు కనిపించేలా వెసులుబాటు కల్పించింది. పత్రాలను సులభంగా అప్‌లోడ్ చేసేందుకు డ్రాప్-డౌన్ బాక్సులను కూడా చేర్చింది. రిజిస్ట్రేషన్ చేసుకునే పూర్తి విధానాన్ని తెలుసుకోవడానికి జీఎస్టీ వెబ్‌సైట్‌లోని 'హెల్ప్' విభాగంలో ఉన్న 'జీఎస్టీ నాలెడ్జ్ పోర్టల్' ద్వారా స్టెప్-బై-స్టెప్ గైడ్‌ను కూడా అందుబాటులో ఉంచింది.

మదుపర్లకు సెబీ ఊరట

కేవైసీ నిబంధనలు సరళతరం!

డిసెంబర్ 24 నుంచి కొత్త నిబంధనలు అమలు



ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): స్టాక్ మార్కెట్ మదుపర్లకు భారతీయ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డు (సెబీ) కీలక ఊరటనిచ్చింది. ఖాతాల ప్రారంభ ప్రక్రియను మరింత సులభతరం చేస్తూ కేవైసీ నిబంధనల్లో మార్పులు ప్రకటించింది. వేర్వేరు బ్రోకరేజ్ సంస్థల వద్ద ఖాతాలు తెరిచే సమయంలో ఒకే రకమైన పత్రాలను పదేపదే సమర్పించాల్సిన అవసరం లేకుండా చర్యలు చేపట్టింది. మధ్యవర్తిత్వ సంస్థల మధ్య సమాచార మార్పిడిని మెరుగుపరచడంతోపాటు మదుపర్ల వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రాధాన్యం కల్పించింది. కొత్త నిబంధనల ప్రకారం ఖాతా ప్రారంభ దరఖాస్తులోని రెండో భాగంలో ఉండే సాధారణ అదనపు సమాచారాన్ని కేవైసీ నమోదు సంస్థ (కేఆర్ఏ) స్థాయిలోనే కేంద్రీకరించనున్నారు. సీకేవైసీ గుర్తింపు సంఖ్య, డిజిపిన్, అధికారిక పత్రాల చెల్లుబాటు గడువు వివరాలను కేఆర్ఏ వ్యవస్థలో నమోదు చేయాల్సి ఉంటుంది. మదుపర్ల మొబైల్ నంబర్ ఇప్పటికే ఆధార్‌తో అనుసంధానమై, కేఆర్ఏ వ్యవస్థలో ధ్రువీకరణ పూర్తయితే మధ్యవర్తిత్వ సంస్థలు మళ్లీ తనిఖీ చేయాల్సిన అవసరం ఉండదు. పేరు మార్పు విషయంలోనూ సెబీ వెసులుబాటు కల్పించింది. పాన్, ఆధార్ కార్డుల్లో పేరు మార్పు పూర్తయితే అదనపు ధ్రువీకరణ పత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదు. లేకపోతే వివాహ ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు వంటి పత్రాలను అందించాల్సి ఉంటుంది. ఆదాయపు పన్ను చట్టం-2025 ప్రకారం భారతీయ నివాసితులుగా అర్హత పొందిన ఓసీఐ కార్డుదారులు, విదేశీయులు భారతీయ చిరునామా రుజువును సమర్పిస్తే విదేశీ చిరునామాకు సంబంధించిన పత్రాలు ఇవ్వాల్సిన అవసరం ఉండదు. మదుపర్ల ఖాతాలు మూసివేసినప్పుడు లేదా మ్యూచువల్ ఫండ్ ఫోలియోలో వరుసగా ఆరు నెలలపాటు ఎలాంటి లావాదేవీలు లేకుండా నిల్వ సున్నాగా ఉన్నప్పుడు ఐదు పనిదినాల్లోగా కేఆర్ఏకు సమాచారం అందించాల్సి ఉంటుంది. తద్వారా అవసరం లేని సంస్థలతో మదుపర్ల వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడాన్ని నివారించనున్నారు. కేవైసీ వివరాలను ధ్రువీకరించినవి, ధ్రువీకరించనివిగా కేఆర్ఏలు వర్గీకరించనున్నాయి. ఈ కొత్త నిబంధనలు డిసెంబర్ 24 నుంచి అమల్లోకి రానున్నాయి.

నారాయణపేట పట్టణంలోని పాత చిన్నపిల్లల ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్





- **భవనంలోని అన్ని గదులను వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు**

నారాయణపేట, నవంబర్,26(సమయం న్యూస్)

జిల్లా కలెక్టర్ ప్రియాంక నారాయణపేట పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న పాత చిన్నపిల్లల ఆసుపత్రిని సందర్శించారు. గతంలో ఈ భవనంలో చిన్నపిల్లల ఆసుపత్రి నిర్వహించబడగా, ప్రస్తుతం ఆ ఆసుపత్రి మెడికల్ కాలేజీకి తరలించబడిన నేపథ్యంలో, భవనంలోని ఖాళీగా ఉన్న అన్ని గదులను ప్రజల అవసరాలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి (DWO), నారాయణపేట గారికి సూచించారు.ఈ మేరకు నారాయణపేట మున్సిపల్ కమిషనర్ గారికి, ఏఈ (పబ్లిక్ హెల్త్) గారికి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.భవనంలోని గదులను వినియోగంలోకి తీసుకురావడానికి అవసరమైన మౌలిక వసతులు, మరమ్మతులు, ఇతర సౌకర్యాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు.అలాగే, భవనంలో ఏవైనా మౌలిక వసతుల లోపాలు ఉన్నట్లయితే వాటిని గుర్తించి, అవసరమైన ప్రతిపాదనలతో కూడిన సమగ్ర నివేదికను రెండు రోజుల్లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్, నారాయణపేట మున్సిపల్ కమిషనర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి (DWO) ఎల్. రాజేందర్ గౌడ్ మరియు ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడా వేదికపై తిమ్మకపల్లి విద్యార్థి ప్రతిభ..

- **పుట్‌బాల్‌లో భారత జట్టు తరపున ప్రాతినిధ్యం.. బంగారు పతకం సాధించి గ్రామానికి గర్వకారణం**
- **మాధ వినయ్ (వినేంద్ర)కు గ్రామస్థుల అభినందనలు**

రాయపోల్: నవంబర్ 26 (సమయం న్యూస్)

సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం తిమ్మకపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి మాధ వినయ్ (వినేంద్ర) అంతర్జాతీయ స్థాయిలో తన క్రీడా ప్రతిభను చాటుకుని బంగారు పతకం సాధించడం గ్రామానికి గర్వకారణంగా నిలిచింది. తన పట్టుదల, కఠోర శ్రమ, క్రమశిక్షణ, అంకితభావంతో అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత జట్టు తరపున షూట్‌బాల్ క్రీడలో ప్రాతినిధ్యం వహించి గోల్డ్ మెడల్ సాధించడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాధారణ గ్రామీణ నేపథ్యం నుంచి ఎదిగి అంతర్జాతీయ స్థాయికి చేరుకోవడం ఎంతో అభినందనీయమని పలువురు పేర్కొంటున్నారు. వినయ్ సాధించిన ఈ విజయం తిమ్మకపల్లి గ్రామానికే కాకుండా మండలానికి, జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిందని కొనియాడుతున్నారు.క్రీడల పట్ల ఆసక్తి, నిరంతర సాధన, లక్ష్యంపై ఏకాగ్రత ఉంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని వినయ్ నిరూపించాడని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. అతని విజయం గ్రామంలోని యువత, విద్యార్థులకు గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొంటూ మాధ వినయ్ (వినేంద్ర)కు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.భవిష్యత్తులోనూ ఇదే పట్టుదలతో మరిన్ని విజయాలు సాధించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని, భారతదేశానికి, తెలంగాణ రాష్ట్రానికి, తిమ్మకపల్లి గ్రామానికి మరింత పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు.



రోడ్డు విస్తరణలో ఇళ్లు కోల్పోతున్న బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ

కొడంగల్ మున్సిపల్, నవంబర్,26(సమయం న్యూస్)

కొడంగల్ పట్టణంలోని లహోటి పార్క్ నుండి శ్రీ మహాలక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం వరకు చేపట్టనున్న 50 ఫీట్ల రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఇళ్లను కోల్పోతున్న బాధిత కుటుంబాలకు గురువారం నష్టపరిహారం చెక్కులను కొడంగల్ మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్ చేతుల మీదుగా పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా రోడ్డు విస్తరణ పనులకు సహకరిస్తున్న బాధిత కుటుంబాలకు మున్సిపల్ చైర్మన్ కృతజ్ఞతలు తెలియజేశారు. కొడంగల్ పట్టణ అభివృద్ధిలో భాగంగా రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్, తహసీల్దార్ రాంబాబు, 7వ వార్డు కౌన్సిలర్ కృష్ణం రాజు,10వ వార్డు కౌన్సిలర్ రాజశేఖర్, కోఆప్షన్ మెంబర్ జి.రమేష్ బాబు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాము, బత్తుల నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



అకాల మరణం పట్ల పంజుగుల విఠల్ రెడ్డి తీవ్ర సంతాపం

- **మృతుడి కుటుంబానికి పరామర్శ**

తాండూరు మండలం, నవంబర్,26(సమయం న్యూస్)

తాండూరు మండలం గౌతాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు శకుంతల అల్లుడు అకాల మరణం చెందడం పట్ల బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు,తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి పంజుగుల విఠల్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి,సంతాపం వ్యక్తం చేశారు. ఈ విషయం తెలుసుకున్న విఠల్ రెడ్డి కొడంగల్ నియోజక వర్గంలోని బొంరస్ పేట మండలం మెట్ల కుంట గ్రామానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా మెట్లకుంట గ్రామంలోని మృతుడి నివాసానికి చేరుకున్న పంజుగుల విఠల్ రెడ్డి, మృతుడి చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం కుటుంబ సభ్యులను కలిసి వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, జరిగిన సంఘటన పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.అకాల మరణం అనేది ఆ కుటుంబానికి తీరని లోటని, ఆప్తుడిని కోల్పోయిన కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మనోధైర్యం కలగాలని, ఆకాంక్షించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, భగవంతుడిని ప్రార్థించారు. బాధలో ఉన్న కుటుంబానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా ఉంటారని, భరోసా కల్పించారు.ఈ పరామర్శ కార్యక్రమంలో యాలాల మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సాయిపూర్ నర్సింలు, శ్రీనివాస్ చారి, వెంకట్ రెడ్డి, మల్లారెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మృతుడికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

- **డిసెంబర్ 1, 2 తేదీల్లో వలిగొండలో యంగ్ కమ్యూనిస్టుల రాజకీయ శిక్షణ తరగతులు**
- **డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలి**

ఆలేరు, నవంబరు 26(సమయం న్యూస్):

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండలో డిసెంబర్ 1, 2 తేదీల్లో రెండు రోజుల పాటు యంగ్ కమ్యూనిస్టుల రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీవైఎఫ్ఐ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షుడు కవిడే సురేష్, కార్యదర్శి బుర్రు అనిల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతలో రాజకీయ అవగాహన పెంపొందించడంతో పాటు, సమాజంలోని ప్రస్తుత పరిస్థితులు, ప్రజా సమస్యలు, యువజన ఉద్యమాలపై స్పష్టమైన అవగాహన కల్పించేందుకు ఈ రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ తరగతుల్లో జిల్లా కమిటీ సభ్యులందరూ తప్పనిసరిగా పాల్గొనాలని కోరారు. జిల్లా కమిటీ సభ్యులు ఇప్పటి నుంచే శిక్షణ తరగతులకు సిద్ధమై, డిసెంబర్ 1వ తేదీన వలిగొండకు చేరుకుని రెండు రోజుల పాటు జరిగే తరగతులను విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు.



వెయ్యి పడకల ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలి

సిద్దిపేట నవంబర్26

ఎన్సాన్‌పల్లిలోని అనంతుల మదన్‌మోహన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో నిర్మిస్తున్న వెయ్యి పడకల ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం పరిశీలించారు.
ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్, మొదటి రెండు అంతస్తులను అత్యవసర, ముఖ్య వైద్య సేవలకు అనుగుణంగా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ పనులు, అదనపు నిధుల అవసరంపై ఎస్టిమేట్ సిద్ధం చేసి, పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.
ఆర్టీవో కార్యాలయం సమీపంలో నిర్మిస్తున్న నర్సింగ్ కళాశాల పనులను కూడా కలెక్టర్ పరిశీలించి, నాణ్యతతో నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రతిభావంతమైన విద్యార్థిని పావనికి శ్రీరామ్ ఫైనాన్స్ వారి రూ.10వేల ప్రోత్సాహక బహుమతి..

రాయపోల్ నవంబర్ 26.

సిద్దిపేట జిల్లారాయపోల్ మండలంలోని బెగంపేట ఉన్నత పాఠశాలలో గత విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థిని పావని మండల స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచిన సందర్భంగా, ఆమె ప్రతిభను గుర్తించి శ్రీరామ్ ఫైనాన్స్ సంస్థ తరపున రూ.10,000 నగదు ప్రోత్సాహక బహుమతిని చెక్కు రూపంలో అందజేయడం జరిగింది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాజాగోపాల్ రెడ్డి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థిని పావని సాధించిన విజయం పాఠశాలకు గర్వకారణమని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, అందించిన ఈ ప్రోత్సాహకం ఎంతో అభినందనీయమని తెలిపారు. ప్రోత్సాహకాలు మరింత మంది విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు స్ఫూర్తినిస్తాయని అన్నారు.ఈ సందర్భంగా విద్యార్థిని పావనిని అభినందిస్తూ, ప్రోత్సాహక బహుమతిని అందించిన శ్రీరామ్ ఫైనాన్స్‌తినిధులకు మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.విద్యార్థుల ప్రోత్సాహంఉజ్వల భవిష్యత్తుకు పునాది ఉంటుందని



ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- **రాజ్యాంగ ప్రవేశికను సమిష్టిగా చదివి ప్రతిజ్ఞ చేసిన జీజీహెచ్ వైద్యులు, సిబ్బంది**

మల్కాజిగిరి, సమయం:

భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) సందర్భంగా కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్), మల్కాజిగిరిలో గురువారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధా సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైద్యులు, అధికారులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశికను సిబ్బంది సమిష్టిగా చదివి, రాజ్యాంగం నిర్దేశించిన విలువలు, ఆశయాలు, ఆదర్శాలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రాధాన్యతను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి ఉన్న హక్కులు, బాధ్యతలు, విధులపై అవగాహన కల్పించారు.ప్రభుత్వ వైద్య సేవల్లో కుల, మత, ప్రాంత, వర్గ భేదాలకు తావులేకుండా ప్రతి ఒక్కరికీ సమానంగా నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలని పిలుపునిచ్చారు.అనంతరం రాజ్యాంగం నిర్దేశించిన ఆశయాలు, విలువలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఆసుపత్రి సిబ్బంది పునరంకితమయ్యారు.



MAS అమలులో తెలంగాణ దేశంలోనే ప్రథమం

- **31 జిల్లాలకు 'సురక్షిత్' హోదా**

హైదరాబాద్, నవంబర్ 26:

NACO ఆధ్వర్యంలోని MAS కార్యక్రమంలో తెలంగాణ దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 31 జిల్లాలు (94 శాతం) 'సురక్షిత్' హోదా సాధించాయి.జాతీయ స్థాయిలో 784 జిల్లాల్లో 273 జిల్లాలు మాత్రమే 'సురక్షిత్' హోదా సాధించగా, తెలంగాణ 94 శాతం నమోదు చేయడం విశేషం. ఈ విజయంపై మంత్రి దామోదర రాజనర్సింహా, సీఎస్ సంజయ్ జాజు, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్. చోంగ్తు అధికారులను, వైద్య సిబ్బందిని అభినందించారు. మిగిలిన రెండు జిల్లాలను కూడా 'సురక్షిత్' హోదాలోకి తీసుకువచ్చి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని అధికారులను కోరారు

స్పోర్ట్స్ సైన్స్‌తో క్రీడాకారుల ప్రతిభకు పదును

హైదరాబాద్, నవంబర్ 26:

క్రీడాకారుల బలాలు, బలహీనతలను శాస్త్రీయంగా విశ్లేషించి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతిభను మెరుగుపరచాలని మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో తెలంగాణ అత్యధిక పతకాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. క్రీడాకారుల ఎంపికలో సిఫార్సులకు తావులేదని, ప్రతిభే ప్రామాణికమని స్పష్టం చేశారు. AI, డేటా విశ్లేషణ వంటి సాంకేతికతను వినియోగించుకోవాలని కోచ్‌లకు సూచించారు. క్రీడా మౌలిక వసతుల కోసం ప్రభుత్వం రూ.203 కోట్లు కేటాయించిందని తెలిపారు. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు.

ప్రపంచానికి తెలంగాణ ప్రగతి చాటిచెప్పేలా గ్లోబల్ సమ్మిట్

హైదరాబాద్, నవంబర్ 26:

తెలంగాణ అభివృద్ధి, పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి చాటిచెప్పేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు ఫ్యూచర్ సిటీలో జరిగే ఈ సదస్సు ద్వారా భారీ పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజాభవన్‌లో జరిగిన సమీక్షలో సదస్సు ఏర్పాట్లను శాఖలవారీగా సమన్వయం చేయాలని, అధికారులు వార్ రూమ్ నుంచే విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఇప్పటికే 1,700 మందికి పైగా ప్రతినిధులు హాజరు ఖరారు చేసుకున్నారని తెలిపారు.సమ్మిట్‌లో తెలంగాణ అభివృద్ధి, సంస్కృతి, కళలు, హస్తకళలు, వంటకాలను ప్రపంచానికి పరిచయం చేసేలా తెలంగాణ స్క్వేర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎస్ సంజయ్ జాజు వెల్లడించారు.

మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

• **జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**

జగిత్యాల, నవంబర్ 26:

జగిత్యాల మెడికల్ కాలేజీ నిర్మాణ పనులను నిర్దేశిత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు.కలెక్టరేట్‌లో మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పురోగతిపై ఇంజినీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లు, విద్యార్థులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. భవన నిర్మాణ పనుల్లో జాప్యం లేకుండా వేగం పెంచాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సూచించారు. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, విద్యా కార్యక్రమాలకు అంతరాయం కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.నిర్మాణ పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించి, పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

• **కలెక్టర్ ప్రతిమా సింగ్**

మెదక్ నవంబర్26(.)

గ్రామీణ ప్రజలు పొదుపు, బ్యాంకింగ్ సేవలు, సామాజిక భద్రతా పథకాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు.చిన్న శంకరంపేట మండలం గవ్వలపల్లి తండాలో ఎస్‌బీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన జన సురక్షా అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా, సురక్షా బీమా, అటల్ పెన్షన్ యోజన వంటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అధికారిక బ్యాంకుల ద్వారానే ఆర్థిక సేవలు పొందాలని, డిజిటల్ చెల్లింపులు, కేవైసీపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు.

వివాదంలో ACB తీరు

ఇతర శాఖల ఉద్యోగులపై అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు సాధారణంగా ACB తక్షణమే స్పందించి, నిబంధనల ప్రకారం ట్రాప్ లేదా చట్టపరమైన చర్యలు చేపడుతుందని ఆరోపణలు ఉన్నాయి.అయితే ప్రస్తుత కేసులో ACB సాధారణ విధానానికి భిన్నంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. క్రిమినల్ అంశాలకు సంబంధించి FIR నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉండగా, ఇప్పటివరకు శాఖాపరమైన విచారణకే పరిమితమై కాలయాపన చేస్తున్నారని ఆరోపిస్తున్నారు.ఈ విధానం సంబంధిత అధికారులకు చట్టపరమైన చర్యల నుంచి రక్షణ కల్పించేందుకేనా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై ACB స్పష్టత ఇవ్వాలని, నిబంధనల ప్రకారం పారదర్శకంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.కావాలంటే దీన్ని ఇంకా ఘాటైన రాజకీయ/ప్రెస్‌మీట్ స్టైల్‌లో కూడా తయారు చేయవచ్చు.

నారెగూడలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

నవాబుపేట మండలం, నవంబర్,26(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని నవాబుపేట మండలం నారెగూడ గ్రామంలో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా అంబేద్కర్ చేసిన అపారమైన కృషిని స్మరించుకుంటూ,రాజ్యాంగం కల్పించిన సమానత్వం, స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని, పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించి, దేశ సమగ్రతకు కట్టుబడి ఉంటామని, ప్రతిజ్ఞ చేశారు.ఈ కార్యక్రమంలో దళిత రత్న అవార్డు గ్రహీత శివరాజ్, జర్నలిస్టులు రాజు, శివకుమార్, మాజీ సర్పంచ్ పర్మయ్య, యువ నాయకులు దశరథ్, బుచ్చయ్య, భీమ్రావు, ఉపాధ్యాయులు,విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు, పాల్గొన్నారు.



వివాహ కార్యక్రమానికి హాజరైన అందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 26

మునిపల్లి మండలంలో ఖమ్మం పల్లి గ్రామానికి చెందిన మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులుమాజీ సర్పంచ్ యాదయ్య గౌడ్ కుమారుడు ప్రవీణ్ సౌజన్య వివాహ వేడుకల్లో స్థానిక నాయకులతో కలిసి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించినఆందోల్ మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్ సంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మంజుశ్రీ జయపాల్ రెడ్డి బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు పైతర సాయికుమార్ మాసన్ పల్లి నారాయణ కార్యక్రమంలో మండల నాయకులు సర్పంచులు మాజీ సర్పంచులు గ్రామ పార్టీ అధ్యక్షులుఖమ్మం పల్లి గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు



హుజురాబాద్ అభివృద్ధికి నా కృషి

ప్రజా సమస్యలపై పోరాటమే నా ప్రాధాన్యం

హైదరాబాద్: హుజురాబాద్ అభివృద్ధికి తాను ఎంతో కృషి చేశానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తెలంగాణలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్నందున నియోజకవర్గానికి తరచూ రాలేకపోతున్నానని, తీరిక దొరికినప్పుడల్లా హుజురాబాద్‌కు వస్తానన్నారు. అసైన్డ్ భూములు, 22ఏ భూములు, రైతుల సమస్యలపై తన పోరాటం కొనసాగుతుందన్నారు. హుజురాబాద్‌లో రహదారులు, విద్యాసంస్థలు, ఆసుపత్రులు, సబ్‌స్టేషన్లు, చెక్‌డ్యాంల నిర్మాణంలో తన పాత్ర ఉందని తెలిపారు. అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఈటల స్పష్టం చేశారు.

రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, పెన్నుల పంపిణీ

కొడంగల్ మండలం, నవంబర్,26(సమయం న్యూస్)



భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొడంగల్ మండలం లోని హస్నాబాద్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేయడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్యంగా పుస్తకాలు, పెన్నులను తన సొంత ఖర్చులతో డొనేట్ చేసిన కంతి అశోక్ ప్రత్యేక అభినందనలకు అర్హులు. విద్యార్థుల చదువుకు తన వంతు సహకారం అందిస్తూ, విద్యాభివృద్ధికి తోడ్పడాలనే ఆయన మంచి మనసు, సేవాభావం అభినందనీయం.విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆయన చేసిన ఈ చిన్న సహాయం ఎంతో గొప్ప సందేశాన్ని అందిస్తోంది.ఈ సందర్భంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను, భారత రాజ్యాంగ గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ గోపాల్ ఆనంద్, మరియు గ్రామ వార్డు సభ్యులు వెంకటయ్య వెంకటమ్మ బాబమ్మ లు మండల నాయకులు నర్సింలు గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.విద్యార్థుల భవిష్యత్తుకు అండగా నిలుస్తూ, విద్యా సేవలో తన వంతు బాధ్యతను నిర్వర్తించిన ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వాళ్లది పత్రికా సమావేశం.. మాది ప్రజలతో మమేకం

• **ప్రజల సమస్యలు తెలుసుకుంటూ వారి పక్షాన నిలుస్తున్నది మా ఐలన్నే**

ఆలేరు, నవంబర్ 26(సమయం న్యూస్):



కొందరు గులాబీ కండువాలు ధరించి పత్రికా సమావేశాలు నిర్వహిస్తూ పెద్దపెద్ద మాటలు మాట్లాడుతున్నారని ఆలేరు పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ముదిగొండ శ్రీకాంత్ విమర్శించారు. పదేళ్ల పాటు అధికారంలో ఉన్న సమయంలో ఆలేరు అభివృద్ధికి ఏం చేశారని ఆయన ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో ఆలేరు రహదారులను అభివృద్ధి చేశారా? రైతుల సమస్యలను పరిష్కరించారా? నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించారా? అని ప్రశ్నించారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోకుండా, ఇప్పుడు అధికారం కోల్పోయిన తర్వాత పత్రికా సమావేశాలు నిర్వహిస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలకు కావాల్సింది మాటలు, ప్రచారాలు కాదని, అభివృద్ధి చేసి చూపించే నాయకత్వమని పేర్కొన్నారు. కొందరికి కెమెరాలు, మైకులు, పత్రికా సమావేశాలే ముఖ్యమైతే, తమ నాయకుడు ఐలన్నకు మాత్రం ప్రజలు, వారి కష్టాలు, సమస్యలే ముఖ్యమని అన్నారు. ఎండనక, వాననక ప్రజల్లో తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలిపారు. పత్రికల్లో వార్తల కోసం మాట్లాడటం కంటే ప్రజల హృదయాల్లో స్థానం సంపాదించుకోవడమే ముఖ్యమని, పదవుల కోసం రాజకీయాలు చేయడం కాకుండా ప్రజల హక్కులు, సంక్షేమం కోసం పోరాడటమే తమ నాయకుడి లక్ష్యమని అన్నారు. ఎన్ని పత్రికా సమావేశాలు నిర్వహించినా, ఎన్ని విమర్శలు చేసినా ఆలేరు ప్రజల విశ్వాసం తమ నాయకుడు ఐలన్నపైనే ఉంటుందని, రాబోయే రోజుల్లో కూడా ఆలేరు గడ్డపై కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ముదిగొండ శ్రీకాంత్ ధీమా వ్యక్తం చేశారు.

సదాశివపేట మండల విద్యాధికారితో జిల్లా తనిఖీ బృందం సభ్యుల సమీక్ష సమావేశం

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్26



సదాశివపేట మండలంలోని ప్రాథమిక పాఠశాలల తనిఖీ కోసం ఎఫ్.ఎల్.ఎన్ జిల్లా తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా సదాశివపేట మండలంలో 12 ఎఫ్.ఎల్.ఎన్ కాంపిటెంట్ పాఠశాలలు మరియు 27 స్టాండర్డ్ పాఠశాలలు తనిఖీ కోసం ఎంపిక చేయబడ్డాయి. వీటిలో 12 ఎఫ్.ఎల్.ఎన్ పాఠశాలలను ప్రతి నెలా క్రమం తప్పకుండా తనిఖీ చేయడం జరుగుతోంది. అదేవిధంగా 27 స్టాండర్డ్ పాఠశాలల్లో ఇప్పటివరకు 15 పాఠశాలల తనిఖీలు పూర్తయ్యాయి.తేదీ 26 11 2026 న తనిఖీ చేసిన పాఠశాలల స్థితిగతులు, ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలు, ఎఫ్.ఎల్.ఎన్ అమలు తీరు తదితర అంశాలపై సదాశివపేట మండల విద్యాధికారి ఎన్. శంకర్ తో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా తనిఖీ బృందం నోడల్ అధికారి సురేష్, బృంద సభ్యులు వల్లభ్ జోషి మరియు సంతోషమ్మ పాల్గొన్నారు

స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా అధికారిక వెబ్ పోర్టల్ ప్రారంభం

• **అదనపు కలెక్టర్ సంగీత చేతుల మీదుగా పోర్టల్ ప్రారంభం**

• **174 పాఠశాలల వివరాలు నమోదు.. యూనిఫాం కొలతల సమర్పణకు ఆన్‌లైన్ సదుపాయం**

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 26:-



భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సంగారెడ్డి జిల్లా కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు, పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావడానికి రూపొందించిన జిల్లా అధికారిక వెబ్ పోర్టల్‌ను జిల్లా అదనపు కలెక్టర్ సంగీత ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన మరియు క్రీడల అధికారి అఖిలేష్ రెడ్డి, జిల్లా రోవర్స్ కమిషనర్ సురభి చైతన్య, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కోశాధికారి సుందర్ రావు, కార్యదర్శి వి. మాధవ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ సంగీత మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకుజిల్లా వెబ్ పోర్టల్ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు.సంబంధిత పాఠశాలలు పోర్టల్‌ను సద్వినియోగం చేసుకొని స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు జిల్లా కార్యదర్శి మాధవరెడ్డి మాట్లాడుతూ,ఈ విద్యా సంవత్సరంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యక్రమాల నిర్వహణకు అనుమతి పొందిన 174 పాఠశాలల వివరాలను ఇప్పటికే పోర్టల్‌లో నమోదు చేసినట్లు తెలిపారు త్వరలో ప్రభుత్వం ద్వారా ఆయా పాఠశాలలకు స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిఫాంలు పంపిణీ చేయనున్న నేపథ్యంలో, విద్యార్థుల యూనిఫాం కొలతలను పాఠశాలల లాగిన్ ద్వారా ఆన్‌లైన్‌లో సులభంగా నమోదు చేసి సమర్పించే సదుపాయాన్ని పోర్టల్‌లో కల్పించినట్లు వివరించారు. సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు ఈ ఆన్‌లైన్ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థుల యూనిఫాం కొలతలను సకాలంలో నమోదు చేయాలని కోరారు. వెబ్ పోర్టల్ వినియోగంలో ఏవైనా సందేహాలు లేదా సమస్యలు ఎదురైతే 9440069750 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

పాలతో సంపూర్ణ ఆరోగ్యం





• **మీర్జాపూర్ లో జాతీయ పాల దినోత్సవం**

కోస్గి మండలం, నవంబర్,26(సమయం న్యూస్)

రోజు క్రమం తప్పకుండా పాలు తాగడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని జాతీయ హరిత దళ సమన్వయకర్త వార్ల మల్లేశం అన్నారు. శ్వేత విప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతిని పురస్కరించుకొని గురువారం మీర్జాపూర్ గ్రామ ఉన్నత పాఠశాలలో జాతీయ పాల దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలలో ఉండే క్యాల్షియం, ప్రోటీన్లు, విటమిన్లు, ఎముకలను బలంగా మార్చి శారీరక ఎదుగుదలకు తోడ్పడుతాయని అన్నారు. చిన్నపిల్లలు మొదలుకొని పెద్దల వరకు అందరికీ సంపూర్ణ శక్తి నిచ్చే పాలు అమృతంతో సమానమని సూచించారు. పాడి పరిశ్రమ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక వంటిదని ఎంతోమంది రైతులు మహిళలకు , పాడి పరిశ్రమ ఉపాధి కల్పిస్తూ ఆదాయాన్ని అందిస్తున్నదని అన్నారు. పాలను, వాటిని అందించే పాడి రైతుల కృషిని గౌరవిస్తామని, పాల దినోత్సవ స్ఫూర్తితో పాడి పరిశ్రమలు మరింత బల పడేలా చేసి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తామని విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కల్తీ పాలను గుర్తింపు అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు విద్యార్థులకు పశుపోషణ, పాల ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులకు పాలను పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.



గాయత్రి జోడీ శుభారంభం

లక్నో: సయ్యద్ మోదీ ఇండియా ఇంటర్నేషనల్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత షట్లర్లు శుభారంభం చేశారు. మహిళల డబుల్స్ లో డిఫెండింగ్ చాంపియన్ పుల్లెల గాయత్రి – ట్రీసా జాలీ తొలి రౌండ్‌లో 21–8, 21–7తో రష్మి గణేశ్–అమృత ప్రముతేశ్ ను ఓడించింది. సింగిల్స్‌లో ఉన్నతి హుడా, అష్మిత చాలిహా, తన్వీ శర్మ, తన్య హేమంత్ కూడా రెండో రౌండ్‌కు చేరారు. మూడో సీడ్ ఉన్నతి 21–15, 21–19తో కాంటెమిర్ (ఉక్రెయిన్)పై , ఐదో సీడ్ అష్మిత 21–14, 21–16తో పోలినా బుహ్రోవా (ఉక్రెయిన్) పై గెలిచారు. పురుషుల సింగిల్స్ లో తుషార్ సువీర్ 21–11, 21–17తో ఐదో సీడ్ జస్టిన్ హో (మలేసియా) పై నెగ్గగా, తెలంగాణ షట్లర్ తరుణ్ 22–23, 11–21తో హువాంగ్ (ఇంగ్లండ్) చేతిలో ఓడిపోయాడు.



భారత్ పాంచ్ పటాకా

భోపాల్: మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీ హాకీ టోర్నీలో భారత జట్టు జోరు కొనసాగుతున్నది. బుధవారం జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 4–0తో జపాన్‌ను ఓడించిన భారత్ వరుసగా ఐదో విజయంతో 15 పాయింట్లు సాధించి పట్టికలో అగ్రస్థానంలో నిలిచింది. ఆతిథ్య జట్టు తరఫున దీపిక 16వ, 48వ నిమిషాల్లో డబుల్ గోల్స్‌తో సత్తా చాటింది. లాల్‌రెమ్‌సియామి (12వ ని), నేహా (28వ ని) చెరో గోల్ చేశారు. ఈ విజయంతో ప్రపంచ ర్యాంకింగ్స్ లో భారత్ అత్యుత్తమంగా నాలుగో స్థానానికి చేరుకుంది.

రెండో టెస్టుకూ సిరాజ్ దూరమేనా?

ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): టీమ్‌ఇండియా సీనియర్ పేసర్ మహ్మద్ సిరాజ్‌కు మరోసారి నిరాశ తప్పేలా లేదు. న్యూజిలాండ్‌తో రెండో టెస్టులోనూ అతడికి తుది జట్టులో చోటు దక్కడం అనుమానంగానే కనిపిస్తోంది. తొలి టెస్టుకు దూరమైన సిరాజ్.. రెండో టెస్టుకూ బెంచ్‌కే పరిమితం కానున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు అందుకు సంకేతాలిస్తున్నాయి. సిరాజ్ ప్రపంచస్థాయి బౌలర్ అని ప్రశంసించిన మోర్కెల్.. తిరిగి జట్టులోకి రావడానికి తన ఆటను సమీక్షించుకుని, మెరుగుపడాల్సిన అంశాలపై దృష్టి పెట్టాలని సూచించాడు. రెండో టెస్టులో భారత తుది జట్టులో ఒక మార్పు జరిగే అవకాశముంది. తొలి టెస్టులో ఆశించిన స్థాయిలో రాణించని ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో యువ పేసర్ గుర్నూర్ బ్రార్‌కు చోటు దక్కవచ్చని తెలుస్తోంది. క్రైస్ట్‌చర్చ్ మైదానం పేసర్లకు అనుకూలించే అవకాశముండటంతో.. ఎత్తుగా ఉండే గుర్నూర్ బౌన్స్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టగలడని టీమ్ మేనేజ్‌మెంట్ భావిస్తోంది. అతడు అరంగేట్రానికి సిద్ధంగా ఉన్నాడని మోర్కెల్ కూడా పేర్కొన్నాడు. వెలింగ్టన్ పిచ్‌పై పచ్చిక(గ్రాస్) ఎక్కువగా ఉండటంతో బంతి బౌన్స్ అవుతుందని భారత జట్టు భావించింది. కానీ, మ్యాచ్‌లో అలాంటి పరిస్థితులు కనిపించలేదని మోర్కెల్ వివరించాడు. న్యూజిలాండ్ బౌలర్ల వేగం కూడా ఆ పిచ్‌పై తగ్గిందని, భారత బౌలర్లనే ప్రత్యేకంగా తప్పుబట్టలేమని పేర్కొన్నాడు. క్రైస్ట్‌చర్చ్‌లోనైనా బౌలర్లు మెరుగైన ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందిస్తారని టీమ్‌ఇండియా ఆశిస్తోంది.



ముంబై ఇండియన్స్ ప్రతిపాదనకు రాజస్థాన్ నిరాకరణ

హార్దిక్ కోసం జైస్వాల్, ఆర్చర్‌ను అడిగిన ముంబై!

- ఇద్దరు కీలక ఆటగాళ్లను వదులుకునేందుకు విముఖత
- మధ్యలోనే నిలిచిపోయిన హార్దిక్ బదిలీ చర్చలు





ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ట్రేడ్ వ్యవహారం మరోసారి ఆసక్తికరంగా మారింది. ముంబై ఇండియన్స్ నుంచి పంజాబ్ కింగ్స్‌కు మారిన హార్దిక్ కోసం అంతకుముందు రాజస్థాన్ రాయల్స్ కూడా తీవ్రంగా ప్రయత్నించినట్లు తాజాగా ఓ నివేదిక వెల్లడించింది. అయితే ముంబై ఇండియన్స్ పెట్టిన డిమాండ్లకు రాజస్థాన్ అంగీకరించకపోవడంతో ఈ డీల్ మధ్యలోనే ఆగిపోయినట్లు తెలుస్తోంది. 2027 ఐపీఎల్ రిటెన్షన్ గడువుకు ముందు హార్దిక్ పాండ్యా భవిష్యత్తుపై ఎన్నో ఊహాగానాలు వినిపించాయి. చెన్నై సూపర్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్, కోల్‌కతా నైట్ రైడర్స్ వంటి ఫ్రాంచైజీల పేర్లు తెరపైకి వచ్చాయి. చివరకు పంజాబ్ కింగ్స్ అతడిని సొంతం చేసుకుంది. ఈ ఒప్పందంలో భాగంగా పంజాబ్ పేసర్ అర్ష్‌దీప్ సింగ్ ముంబై ఇండియన్స్‌కు వెళ్లాడు. అయితే హార్దిక్ కోసం రాజస్థాన్ చేసిన ప్రయత్నం ఎందుకు విఫలమైందనే డీటెయిల్స్ తాజాగా వెలుగులోకి వచ్చాయి. ఓ జాతీయ మీడియా కథనం ప్రకారం.. పాండ్యాను ఇచ్చేందుకు రాజస్థాన్ ముందు ముంబై భారీ ప్రతిపాదన ఉంచిందట. యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌తో పాటు ఇంగ్లండ్ స్టార్ పేసర్ జోఫ్రా ఆర్చర్‌ను కూడా ట్రేడ్‌లో భాగంగా ఇవ్వాలని ముంబై కోరినట్లు సమాచారం. అయితే ఈ ఇద్దరు కీలక ఆటగాళ్లను వదులుకోవడానికి రాజస్థాన్ యాజమాన్యం ఇష్టపడలేదు. దీంతో ఈ చర్చలను మరింత ముందుకు తీసుకెళ్లలేదట. హార్దిక్ పాండ్యాను దక్కించుకోలేకపోయినప్పటికీ రాజస్థాన్ రాయల్స్ మరో కీలక ట్రేడ్ డీల్‌ను పూర్తి చేసింది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సామ్ కరన్‌ను లక్నో సూపర్ జెయింట్స్‌కు పంపించి.. ప్రతిగా భారత సీనియర్ పేసర్ మహమ్మద్ షమీ, స్పిన్నర్ మనీమారన్ సిద్ధార్థ్‌ను జట్టులోకి తీసుకుంది. ఈ ఒప్పందంలో షమీని లక్నో గతంలో రూ.10 కోట్లకు కొనుగోలు చేయగా.. రాజస్థాన్‌కు మారే సమయంలో అతడి ధరను రూ.8 కోట్లుగా నిర్ణయించినట్లు సమాచారం. లెఫ్టార్మ్ స్పిన్నర్ ఎం. సిద్ధార్థ్ తన ప్రస్తుత ధర రూ.75 లక్షలకే రాజస్థాన్‌కు మారనున్నాడు. మరోవైపు సామ్ కరన్ రూ.2.4 కోట్ల ప్రస్తుత ధరతో లక్నో సూపర్ జెయింట్స్‌కు వెళ్లనున్నాడు.మహమ్మద్ షమీ రాకతో రాజస్థాన్ రాయల్స్ పేస్ బౌలింగ్ విభాగం మరింత బలోపేతం కానుంది. ఇప్పటికే జోఫ్రా ఆర్చర్ వంటి ప్రపంచస్థాయి బౌలర్ జట్టులో ఉండటంతో.. కొత్త బంతితో వీరిద్దరూ ప్రత్యర్థి బ్యాటర్లకు సవాళ్లు విసిరే అవకాశం ఉంది. 2024 సీజన్‌లో రాజస్థాన్ తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా ఆర్చర్ నిలిచాడు. మరోవైపు షమీకి ఐపీఎల్‌లో మంచి అనుభవం ఉంది. ఇప్పటివరకు 132 మ్యాచ్‌లు ఆడి 145 వికెట్లు పడగొట్టాడు. కొత్త బంతితో వికెట్లు తీయగల సామర్థ్యం, అంతర్జాతీయ అనుభవం రాజస్థాన్‌కు ఉపయోగపడనున్నాయి. ఇప్పుడు షమీ, ఆర్చర్ జోడీ ఎలా రాణిస్తుందన్నది ఐపీఎల్ 2027లో ఆసక్తికరంగా మారనుంది.

రెండో టెస్ట్‌లోనూ గూర్నూర్?

శుక్రవారం నుంచి భారత్--న్యూజిలాండ్ రెండో టెస్టు

- క్రైస్ట్‌చర్చ్ వేదికగా కీలక పోరు
- భారత తుది జట్టులో మార్పులకు అవకాశం
- ప్రసిధ్ కృష్ణ, అన్షుల్ కంబోజ్‌లలో ఒకరిపై వేటు?
- గూర్నూర్ బౌలింగ్‌పై మోర్నీ మోర్కెల్ ప్రశంసలు

క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 26 (సమయం న్యూస్): రెండు టెస్ట్‌ల సిరీస్‌లో భాగంగా శుక్రవారం నుంచి న్యూజిలాండ్, భారత్ మధ్య రెండో టెస్టు ఆరంభం కానుంది. ఈ టెస్టుకు టీమిండియా తుది జట్టులో మార్పులు చోటుచేసుకునే అవకాశాలు ఉన్నాయి. యువ ఫాస్ట్ బౌలర్ గూర్నూర్ బ్రార్‌కు టెస్టు అరంగేట్రం చేసే ఛాన్సెస్ మెండుగా ఉన్నట్లు తెలుస్తోంది. భారత బౌలింగ్ కోచ్ మోర్నీ మోర్కెల్ చేసిన వ్యాఖ్యలు ఈ ఊహాగానాలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. క్రైస్ట్‌చర్చ్‌లోని హ్యాగ్లీ ఓవల్ పిచ్ పరిస్థితులకు గూర్నూర్ బౌలింగ్ సరిగ్గా సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గూర్నూర్ బ్రార్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. భారత జట్టు తరఫున అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. అతడి వేగం, బౌన్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండో టెస్టుకు ముందు మీడియాతో మాట్లాడిన మోర్నీ మోర్కెల్.. 'భారత జట్టులోకి వచ్చినప్పటి నుంచి గూర్నూర్ గురించి ఎంతో ఆసక్తి నెలకొంది. అతడి వేగం, బౌన్స్ చాలా బాగున్నాయి. ఇక్కడి పరిస్థితులకు అతడు చక్కగా సరిపోతాడని భావిస్తున్నాను. ఏం జరుగుతుందో చూద్దాం' అని చెప్పాడు. గూర్నూర్ జట్టులోకి వస్తే.. అన్షుల్ కంబోజ్ లేదా ప్రసిధ్ కృష్ణలలో ఒకరిపై వేటు పడనుంది. గూర్నూర్ బ్రార్ టెస్టు జట్టులో చోటు కోసం గట్టిగా ప్రయత్నిస్తున్నాడని మోర్కెల్ తెలిపాడు. 'గూర్నూర్ టెస్టు జట్టులోకి వచ్చేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నాడు. అన్ని విషయాల్లోనూ సరైన మార్గంలోనే వెళ్తున్నాడు. అయితే ఆటగాడిగా తుది జట్టు ఎంపిక మన చేతుల్లో ఉండదు. అవకాశం వచ్చినప్పుడు దాన్ని సద్వినియోగం చేసుకునేలా సిద్ధంగా ఉండాలి. అరంగేట్రానికి దగ్గరగా ఉన్నప్పుడు కొంతమంది బౌలర్లు ఒత్తిడికి గురవుతారు. అతడికి అవకాశం ఎప్పుడు వస్తుందో చెప్పలేం. కానీ ఆ సమయానికి అతడు పూర్తి స్థాయిలో సిద్ధంగా ఉండేలా చూడటం నా బాధ్యత' అని వివరించాడు. రెండో టెస్టు జరగనున్న హ్యాగ్లీ ఓవల్ పిచ్‌పై కూడా మోర్కెల్ స్పందించాడు. మైదానంలో పిచ్‌పై ఎక్కువ మొత్తంలో పచ్చిక కనిపిస్తోందని, అయితే అది మ్యాచ్‌లో ఎలా స్పందిస్తుందో చూడాలని తెలిపాడు. 'నేను చూసినంతవరకు పిచ్‌పై ఎక్కువ పచ్చిక ఉంది. గత మ్యాచ్‌కు ముందు కూడా పిచ్‌పై మంచి బౌన్స్, వేగం ఉంటాయని భావించాం. కానీ మ్యాచ్‌లో పరిస్థితులు అలా లేవు. కాబట్టి పిచ్ ఎలా ఉంటుందో మనం ఇప్పుడే చెప్పలేం. బ్యాటింగ్, బౌలింగ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ఆడటమే ముఖ్యం' అని పేర్కొన్నాడు. యువ పేసర్ అన్షుల్ కంబోజ్ ప్రదర్శనపైనా మోర్కెల్ స్పందించాడు. గత ఏడాది ఇంగ్లండ్ పర్యటనలో ఓల్డ్ ట్రాఫోర్డ్ వేదికగా టెస్టు అరంగేట్రం చేసిన కంబోజ్.. తొలి మ్యాచ్‌లో 18 ఓవర్లు బౌలింగ్ చేసి 89 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. వెల్లింగ్టన్‌లో జరిగిన తొలి టెస్టులో కొత్త బంతితో వికెట్ సాధించడంతో పాటు నైట్‌వాచ్‌మన్‌గా 38 పరుగులు చేసి ఆకట్టుకున్నాడు. అయితే తొలి టెస్టు ప్రదర్శన ఆధారంగా కంబోజ్‌ను అంచనా వేయకూడదని మోర్కెల్ సూచించాడు. 'అది కేవలం అన్షుల్ విషయంలోనే కాదు. న్యూజిలాండ్ బౌలర్లు కూడా ఆ పిచ్‌పై తక్కువ వేగంతో బౌలింగ్ చేశారు. ఒక ఆటగాడిని అతడి తొలి టెస్టుతోనే అంచనా వేయడం సరికాదు. తొలి మ్యాచ్ ఆడేటప్పుడు ఆటగాళ్లలో ఎన్నో భావోద్వేగాలు ఉంటాయి. జట్టు కోసం కఠిన ఓవర్లు వేస్తున్న అతడికి మనం మద్దతుగా నిలవాలి. రెండు మూడు మ్యాచ్‌లు ఆడిన తర్వాత అతడి ప్రదర్శనపై చర్చించవచ్చు. ఇప్పుడే ఒక అభిప్రాయానికి రావడం తొందరపాటు అవుతుంది' అని స్పష్టం చేశాడు. రెండో టెస్ట్‌కు భారత తుది జట్టు (అంచనా)లో యశస్వి జైస్వాల్, కేఎల్ రాహుల్, దేవదత్ పడిక్కల్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రిషభ్ పంత్ (కీపర్), ధ్రువ్ జురెల్, వాషింగ్టన్ సుందర్, జస్ప్రీత్ బుమ్రా, ఆకాష్ దీప్, అన్షుల్ కాంబోజ్, ప్రసిధ్ కృష్ణ లేదా గుర్నూర్ బ్రార్ ఉన్నారు.





సారా అర్జున్‌కు బాలీవుడ్‌లో బంపర్ ఆఫర్!

రామ్‌చరణ్ చిత్రంలోనూ సారాకు అవకాశం?

ముంబై, నవంబర్ 26 (సమయం న్యూస్): 'ధురంధర్' చిత్రాలతో దేశవ్యాప్తంగా గుర్తింపు సంపాదించుకున్న యువ నటి సారా అర్జున్‌కు బాలీవుడ్‌లో మరో భారీ అవకాశం దక్కినట్లు ప్రచారం జరుగుతోంది. కథానాయికగా తొలి అడుగులోనే భారీ విజయాన్ని అందుకున్న సారా తదుపరి చిత్రాల ఎంపికలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు సమాచారం. 'ధురంధర్ 2' విడుదలై ఎనిమిది నెలలు గడుస్తున్నప్పటికీ ఆమె కొత్త చిత్రానికి సంబంధించి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. తాజాగా ప్రముఖ నిర్మాణ సంస్థ యశ్‌రాజ్ ఫిల్మ్స్ రూపొందించనున్న సంగీత ప్రధాన ప్రేమకథా చిత్రంలో సారాను కథానాయికగా ఎంపిక చేసినట్లు బాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. 'సైయారా' చిత్రంతో భారీ విజయాన్ని అందుకున్న ఈ సంస్థ మరో ప్రేమకథను ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు సిద్ధమవుతోందట. ఇందులో అంబరీష్ వర్మ కథానాయకుడిగా నటించనున్నట్లు సమాచారం. మనీష్ శర్మ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రానికి ప్రస్తుతం నిర్మాణ పూర్వ పనులు జరుగుతున్నాయని, వచ్చే ఏడాది జనవరిలో చిత్రీకరణ ప్రారంభించే అవకాశముందని తెలుస్తోంది. మరోవైపు ప్రముఖ నటి మధుబాల జీవితకథ ఆధారంగా తెరకెక్కనున్న చిత్రంలోనూ సారా పేరు వినిపిస్తోంది. తెలుగులో 'యుఫోరియా' చిత్రంలో నటించిన ఆమెకు రామ్‌చరణ్ తదుపరి చిత్రం 'ఆర్సీ17'లో కథానాయికగా అవకాశం దక్కే సూచనలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పాత్ర కోసం సారా అర్జున్, సాత్విక వీరవల్లా పేర్లను చిత్రబృందం పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఈ చిత్రాల్లో సారా ఎంపికకు సంబంధించి అధికారిక ప్రకటనలు వెలువడాల్సి ఉంది.

బన్నీ 25వ చిత్రానికి దర్శకుడెవరు?

తదుపరి చిత్రాలపై అల్లు అర్జున్ భారీ ప్రణాళికలు

హైదరాబాద్, నవంబర్ 26 (సమయం న్యూస్): 'పుష్ప 2' చిత్రంతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన తదుపరి చిత్రాల విషయంలో భారీ ప్రణాళికలతో ముందుకు సాగుతున్నారు. ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాకా' చిత్రంతో తన స్థాయిని మరింత పెంచుకోవాలని భావిస్తున్నారు. చిత్ర నిర్మాణానికి ఎంత సమయం పట్టినా నాణ్యత విషయంలో రాజీపడకూడదనే లక్ష్యంతో ఉన్నట్లు సమాచారం. ఇప్పటివరకు విడుదల తేదీని ప్రకటించకపోవడంతో ఈ చిత్రం 2027లో ప్రేక్షకుల ముందుకు వస్తుందా? లేక 2028 వరకు వేచి చూడాల్సిందేనా? అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది. 'రాకా' చిత్రంతో తీరిక లేకుండా ఉన్నప్పటికీ తదుపరి చిత్రాలపైనా బన్నీ దృష్టి సారించారు. ఇప్పటికే ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో సినిమా చేసేందుకు అంగీకరించినట్లు సమాచారం. మరోవైపు 'సరైనోడు' చిత్రంతో భారీ విజయాన్ని అందించిన బోయపాటి శ్రీనుతో మరోసారి జతకట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సినీవర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బోయపాటి చెప్పిన కథను ఇప్పటికే విన్నారని, చిత్రాన్ని ఖరారు చేయడమే మిగిలిందని తెలుస్తోంది. మలయాళ నటుడు, దర్శకుడు బాసిల్ జోసెఫ్ కూడా అల్లు అర్జున్ తదుపరి చిత్రాల దర్శకుల జాబితాలో ఉన్నట్లు సమాచారం. అన్నీ అనుకున్నట్లు జరిగితే వచ్చే ఏడాది వీరిద్దరి కలయికలో సినిమా ప్రారంభమయ్యే అవకాశముందట. మరోవైపు ఓ బాలీవుడ్ దర్శకుడితోనూ బన్నీ సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. తన సినీ ప్రస్థానంలో మైలురాయిగా నిలిచే 25వ చిత్రాన్ని అల్లు అర్జున్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్రానికి దర్శకత్వం వహించే అవకాశం ఎవరికి దక్కుతుందనేది సినీవర్గాల్లో ఆసక్తికరంగా మారింది. 'రాకా' అనంతరం లోకేశ్ కనగరాజ్, బోయపాటి శ్రీను, బాసిల్ జోసెఫ్‌లలో ఎవరితో ముందుగా సినిమా చేస్తారన్నది అధికారిక ప్రకటనతోనే తేలనుంది.



పాక్ కంటెంట్‌కు భారత్‌లో కత్తెర!

- నెట్‌ఫ్లిక్స్‌కు కేంద్ర సమాచార, ప్రసార శాఖ కీలక ఆదేశాలు
- పాకిస్థాన్ సినిమాలు, వెబ్ సిరీస్‌లను నిలిపివేయాలని సూచన
- జాతీయ భద్రత దృష్ట్యా గత మార్గదర్శకాలను పాటించాలని స్పష్టీకరణ
- పాకిస్థానీ వెబ్ సిరీస్ విడుదల నేపథ్యంలో వివాదం
- బెంగళూరులో పాక్ డ్రామా ప్రత్యేక ప్రదర్శనలు రద్దు



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): భారత్‌లో పాకిస్థాన్‌కు చెందిన సినిమాలు, వెబ్ సిరీస్‌లు, ఇతర డిజిటల్ వినోద కార్యక్రమాలు అందుబాటులో లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్‌ను కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఆదేశించినట్లు సమాచారం. నెట్‌ఫ్లిక్స్ నిర్మించిన తొలి పాకిస్థానీ ఒరిజినల్ వెబ్ సిరీస్ 'జో బచే హై సంగ్ సమేట్ లో' డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో ఈ వ్యవహారం తెరపైకి వచ్చింది. సదరు సిరీస్‌ను భారత్‌లోనూ విడుదల చేసే అవకాశాలున్నాయంటూ పలు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందడంతో కేంద్రం స్పందించినట్లు తెలుస్తోంది. 2025 ఏప్రిల్ 22న జరిగిన పహల్గామ్ ఉగ్రదాడి అనంతరం భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. జాతీయ భద్రతా కారణాల దృష్ట్యా అదే ఏడాది మే 8న కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కీలక మార్గదర్శకాలను జారీ చేసింది. భారత్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఓటీటీ సంస్థలు, డిజిటల్ ప్రసార వేదికలు పాకిస్థాన్ మూలాలున్న వినోద కార్యక్రమాలను నిలిపివేయాలని సూచించింది. సమాచార సాంకేతిక నిబంధనలు--2021 ప్రకారం దేశ సార్వభౌమాధికారం, సమగ్రత, జాతీయ భద్రత, విదేశీ సంబంధాలు, ప్రజాశాంతికి విఘాతం కలిగించే ప్రసారాల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని పేర్కొంది. భారతీయ ప్రేక్షకులకు పాకిస్థాన్ సినిమాలు, సిరీస్‌లు అందుబాటులో ఉంచబోమని 2025 జూన్‌లో నెట్‌ఫ్లిక్స్ లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినట్లు సమాచారం. ఆ హామీకి కట్టుబడి ఉండాలని కేంద్రం తాజాగా స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. మరోవైపు బెంగళూరులో పాకిస్థానీ టీవీ డ్రామా 'దార్-ఏ-నిజాత్' ప్రత్యేక ప్రదర్శనల వ్యవహారం వివాదాస్పదమైంది. నవంబర్ 28న ఫ్రేజర్ టౌన్‌లోని ఓ రెస్టారెంట్‌లో, డిసెంబర్ 5న జయమహల్ ఎక్స్‌టెన్షన్‌లోని ప్రైవేటు థియేటర్‌లో ఈ ప్రదర్శనలను నిర్వహించేందుకు రెండు వేర్వేరు సంస్థలు ఏర్పాట్లు చేశాయి. కార్యక్రమాలకు హాజరయ్యేవారు పాకిస్థానీ సంప్రదాయ దుస్తులు ధరించి రావాలని ఆహ్వాన పత్రికల్లో పేర్కొనడంపై సామాజిక మాధ్యమాల్లో పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. బెంగళూరు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఈ కార్యక్రమాల నిర్వహణకు పోలీసుల నుంచి ముందస్తు అనుమతులు తీసుకోలేదని బెంగళూరు పోలీస్ కమిషనర్ ఆర్.హితేంద్ర వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగే అవకాశాలపై పోలీసులు నిర్వాహకులను సంప్రదించి వివరాలు సేకరించారు. సామాజిక మాధ్యమాల్లో వ్యక్తమైన వ్యతిరేకత, పోలీసుల విచారణ నేపథ్యంలో రెండు ప్రదర్శనలను రద్దు చేస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. కుటుంబ సభ్యులు, సన్నిహితుల కోసం ఏర్పాటు చేసుకున్న కార్యక్రమం వివాదాస్పదం కావడంతో రద్దు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రెండు ప్రదర్శనల రద్దును పులకేశినగర్ పోలీసులు ధ్రువీకరించారు.

'నంది' అవార్డులకు గ్రీన్ సిగ్నల్!



అమరావతి, నవంబర్ 26 (సమయం న్యూస్): తెలుగు సినీ, టెలివిజన్, నాటక రంగాల కళాకారుల సుదీర్ఘ నిరీక్షణకు ఎట్టకేలకు తెరపడింది. ప్రతిష్ఠాత్మక 'నంది' అవార్డుల ప్రదానంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమరావతి నుంచి తాజాగా వెలువడిన ఉత్తర్వులతో టాలీవుడ్‌తో పాటు బుల్లితెర, రంగస్థల కళాకారుల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న నంది పురస్కారాల విషయంలో ప్రభుత్వం వేగం పెంచి, ఏకంగా 2017 నుంచి 2025 వరకు అంటే తొమ్మిదేళ్ల కాలానికి సంబంధించిన అవార్డులను ఒకేసారి అందించేందుకు రంగం సిద్ధమైంది. సినిమా, టెలివిజన్, నాటక రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఎంపిక చేసే ప్రక్రియను వేగవంతం చేస్తూ ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. కేవలం ప్రకటనతోనే సరిపెట్టకుండా, వచ్చే నెల అంటే డిసెంబర్‌లోనే నంది అవార్డుల ప్రదానోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు ముమ్మరం చేస్తోంది. ఈ ప్రతిష్ఠాత్మక వేడుకను విజయవాడలో గానీ, లేదా రాజధాని అమరావతిలో గానీ అట్టహాసంగా నిర్వహించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు తొమ్మిదేళ్ల తర్వాత నంది అవార్డుల సందడి మళ్ళీ మొదలవుతుండటంతో, 2017 నుంచి 2025 మధ్య వచ్చిన ఏయే చిత్రాలు, ఏయే నటీనటులు, సాంకేతిక నిపుణులు ఈ గౌరవాన్ని దక్కించుకుంటారనే ఆసక్తి ఇప్పుడు సినీ వర్గాల్లో జోరుగా చర్చనీయాంశమైంది. మొత్తానికి, డిసెంబర్‌లో తెలుగు కళాకారులందరికీ ఇదొక నిజమైన పండగ కాబోతోంది.

'రామాయణ' చిత్రబృందంపై అమిత్‌షా ప్రశంసలు!



న్యూఢిల్లీ, నవంబర్ 26 (సమయం న్యూస్): భారతీయ ఇతిహాసం ఆధారంగా తెరకెక్కిన భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' చిత్రబృందంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసలు కురిపించినట్లు సమాచారం. గురువారం న్యూఢిల్లీలో అమిత్ షాతో కథానాయకుడు రణబీర్ కపూర్, కథానాయిక సాయిపల్లవి, దర్శకుడు నితేశ్ తివారీ, నిర్మాత నమిత్ మల్హోత్రా, సహ నిర్మాత నీరజ్ సంఘాయ్ సమావేశమయ్యారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే రామాయణ ఇతిహాసాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో వెండితెరపై ఆవిష్కరించినందుకు చిత్రబృందాన్ని అమిత్ షా అభినందించినట్లు తెలుస్తోంది. రణబీర్ కపూర్, సాయిపల్లవి, యశ్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. అద్భుతమైన దృశ్య ప్రభావాలు, భారీ నిర్మాణ విలువలు, ఆకట్టుకునే కథనంతో దేశవిదేశాల్లో ప్రేక్షకుల ఆదరణ పొందుతోంది. ఇప్పటివరకు ప్రపంచవ్యాప్తంగా రూ.1,755 కోట్లకు పైగా స్థూల వసూళ్లు సాధించినట్లు సినీ వాణిజ్య వర్గాలు వెల్లడిస్తున్నాయి. రూ.1,742 కోట్ల వసూళ్లతో రికార్డు సృష్టించిన 'పుష్ప 2'ను ఈ చిత్రం అధిగమించినట్లు ప్రచారం జరుగుతోంది. భారీ వసూళ్లతోపాటు అంతర్జాతీయ పురస్కారాల వేదికపైనా 'రామాయణ' సత్తా చాటుతున్నట్లు సమాచారం. 2027 ఆస్కార్ పురస్కారాలకు సంబంధించి ఉత్తమ దృశ్య ప్రభావాల విభాగంలో పరిశీలనకు ఎంపికైన 20 చిత్రాల జాబితాలో 'రామాయణ'కు చోటు దక్కినట్లు తెలుస్తోంది. భారతీయ పౌరాణిక చిత్రాలకు అంతర్జాతీయ స్థాయిలో మరింత ఆదరణ పెరిగేందుకు ఈ విజయం దోహదపడుతుందనే అభిప్రాయాలు సినీవర్గాల్లో వ్యక్తమవుతున్నాయి.

PRINTED AND PUBLIAHED BY **MOHAMMED MURTHUZA,** 1-2-524/3/B, ROOM NO. 110, 1ST FLOOR, SAGAR VIEW COMPLEX, DOMALGUDA, HYDERABAD, TELANGANA - 500080, ON BEHALF OF MOHAMMED MURTHUZA, EDITED BY MOHAMMED MURTHUZA, PRINTED BY JAKKULA NARENDER, AT VISION ANDHRA, 2-1-340/A/4, NEAR FEVER HOSPITAL, O.U.ROAD, NALLAKUNTA, HYDERABAD, TELANGANA - 500044. **PRGI NUMBER APTEL/2006/18267.** PHONE:**7036644111, 9490140565**

ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

సంగారెడ్డి సమయం న్యూస్ నవంబర్ 26

రాయికోడ్ మండల భారత రాజ్యాంగ దినోత్సవం (సంవిధాన్ దివస్) సందర్భంగా రాయికోడ్ ఎంపీడీవో కార్యాలయంలో గురువారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు ఎంపీడీవో ఎంఎం షరీఫ్ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీవో, అధికారులు, సిబ్బంది, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా భారత రాజ్యాంగ ప్రవేశికను సిబ్బంది సమిష్టిగా చదివి, రాజ్యాంగం నిర్దేశించిన విలువలు, ఆశయాలు, ఆదర్శాలను కాపాడుతామని ప్రతిజ్ఞ చేశారు. న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి రాజ్యాంగ



మౌలిక సూత్రాల ప్రాధాన్యతను వివరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతి పౌరుడికి ఉన్న హక్కులు, బాధ్యతలు, విధులపై అవగాహన కల్పించారు.ప్రభుత్వ, ఉద్యోగాలు సిబ్బంది సేవల్లో కుల, మత, ప్రాంత, వర్గ భేదాలకు తావు లేకుండా ప్రతి ఒక్కరికీ సమానంగా నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వ ఉద్యోగులపై ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించాలని పిలుపునిచ్చారు. అనంతరం రాజ్యాంగం నిర్దేశించిన ఆశయాలు, విలువలను పాటిస్తూ ఈ కార్యక్రమంలో ఏపీ ఓ రమేష్ ఈసీ విష్ణువర్ధన్ జూనియర్ అసిస్టెంట్ శ్యామ్ పంచాయతీ కార్యదర్శిలు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్లు జహీర్ అనిల్ జహీర్ ఎంపీ ఓ కంప్యూటర్ ఆపరేటర్ ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత

- **సంవిధాన్ రక్షా మార్చ్‌లో వర్ధన్నపేట ఎమ్మెల్యే 'కేఆర్ నాగరాజు'**

వర్ధన్నపేట, నవంబర్ 26 (సమయం న్యూస్):

భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పేర్కొన్నారు. రాజ్యాంగ పరిరక్షణే లక్ష్యంగా ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంవిధాన్ రక్షా మార్చ్ (రాజ్యాంగ పరిరక్షణ యాత్ర)లో ఆయన పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం ప్రారంభమైన యాత్ర నెక్లెస్ రోడ్‌లోని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం వరకు కొనసాగింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ సందీప్ కుమార్, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలతో కలిసి కేఆర్ నాగరాజు యాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ అంటే దేశ ప్రజాస్వామ్యాన్ని, ప్రజల హక్కులను కాపాడటమేనని పేర్కొన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా సమానత్వం, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి



చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువల పరిరక్షణకు కాంగ్రెస్ పార్టీ ప్రజల పక్షాన నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు .ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ ముఖ్య నాయకులు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, మండల, డివిజన్ అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు, సర్పంచులు, ఉపసర్పంచులు, కౌన్సిలర్లు, వార్డు సభ్యులు, గ్రామశాఖ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనే లక్ష్యం.. బీజేపీ చైతన్య ర్యాలీ

- **అంబేద్కర్ ఆశయ సాధనకు బీజేపీ కట్టుబడి ఉంది... 'గంట రవికుమార్'**

వరంగల్, నవంబర్ 26 (సమయం న్యూస్):

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు బీజేపీ కట్టుబడి పనిచేస్తోందని ఆ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మదాసు రాజు ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ మైదానం నుంచి కాశీబుగ్గ అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన చైతన్య ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంట రవికుమార్, రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, చింతం సాంబమూర్తి, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ లు మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలను నెరవేర్చడంలో ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. అంబేద్కర్ జీవించి ఉన్నప్పుడు ఎన్నికల్లో ఓడించేందుకు కాంగ్రెస్ కుట్రలు చేసిందని, మరణానంతరం భారతరత్న ఇవ్వడంలోనూ నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రాజ్యాంగాన్ని స్వార్థ రాజకీయాల కోసం అనేకసార్లు సవరించిన



కాంగ్రెస్ నేడు రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. అంబేద్కర్‌కు సంబంధించిన ఐదు ముఖ్య ప్రాంతాలను పంచతీర్థాలుగా అభివృద్ధి చేసి ఆయనకు ఘనమైన నివాళులర్పించిన ఘనత ప్రధాని మోదీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. దళిత, బహుజన వర్గాల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యతని, అంబేద్కర్ ఆశయ సాధనకు బీజేపీ కార్యకర్తలు అంకితభావంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.ర్యాలీలో బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రభారి కుసుమ సతీష్, రత్నం సతీష్ షా, జలగం రంజిత్ రావు, టాబేటి వెంకట్ గౌడ్, బైరి మురళీకృష్ణ, బన్న ప్రభాకర్, గడ్డం మహేందర్, గరిగె మాధవి, పోగుల అశోక్, సదానందం, బాబూరావు, దయాకర్, గార్లపాటి మంజుల రెడ్డి, మాచర్ల దీన్ దయాళ్, ఎరుకల రఘునారెడ్డి, బైరి శ్యాంసుందర్, కందిమల్ల మహేష్, ముంద్రాతి వెంకటేశ్వర్లు, మార్తా ఉషారాణి తదితర జిల్లా నాయకులు, వివిధ మోర్చాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామగ్రామాన రాజ్యాంగ చైతన్యమే'ఐఎల్‌పీఏ'లక్ష్యం

- **రాజ్యాంగ హక్కులు, విలువలపై ప్రజలకు అవగాహన కల్పించాలి... విలాసాగరం సురేందర్**

హన్మకొండ, నవంబర్ 26 (సమయం న్యూస్):

స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం ప్రతిబింబించే భారత రాజ్యాంగ విలువలను గ్రామగ్రామాన ప్రజలకు చేరవేసి, హక్కుల పై చైతన్యం కల్పించడమే ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) లక్ష్యమని వరంగల్ జిల్లా అధ్యక్షుడు విలాసాగరం సురేందర్ అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వరంగల్ కోర్టు అంబేద్కర్ హాల్‌లో ఐఎల్‌పీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి గురిమిల్ల రాజు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.రాజ్యాంగం అమల్లోకి వచ్చి 76 ఏళ్లు గడిచినా మెజార్టీ ప్రజలకు రాజ్యాంగ విలువలు, హక్కులు, ఓటు ప్రాధాన్యం, ఎన్నికలు, ప్రజాస్వామ్య వ్యవస్థపై అవగాహన లేకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు రాజ్యాంగ హక్కులపై అవగాహన కల్పించకుండా పాలకవర్గాలు తమ పాలన కొనసాగిస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ వ్యక్తం చేసిన ఆందోళనలకు అనుగుణంగా నేటికీ కుల, మత విభేదాలు, రాజకీయ వైరుధ్యాలు సమాజాన్ని వెంటాడుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం కోసం రూపొందించిన రాజ్యాంగాన్ని పాలకులు తమ స్వార్థ ప్రయోజనాలకు ఉపయోగిస్తూ, ప్రజలను అణచివేసే చట్టాలకు వేదికగా మారుస్తున్నారని ఆరోపించారు.రాజ్యాంగ స్ఫూర్తితో స్వేచ్ఛ, సమానత్వం పెంపొందించాల్సిన పాలకులు మత ఘర్షణలు, జాతి విపక్ష, విచ్ఛిన్నకర ధోరణులను ప్రోత్సహిస్తూ పాలన సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో అణగారిన వర్గాల నుంచి ఎదిగిన న్యాయవాదులు రాజ్యాంగ విలువలు, హక్కులను ప్రతి గ్రామానికి తీసుకెళ్లి సమసమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సిద్ధాంతాల పునాదితో నల్లకోట్ల నీలి విప్లవాన్ని విజయవంతం చేసేందుకు ఐఎల్‌పీఏ దేశవ్యాప్తంగా ఉద్యమిస్తోందని, ప్రగతిశీల భావాలున్న న్యాయవాదులు ఇందులో భాగస్వాములు కావాలని కోరారు.కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు చిర్ర సాంబశివరాజు, పరికరాల రఘుపతి, ఐఎల్‌పీఏ వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన కార్యదర్శులు గురిమిల్ల రాజు, చింత సాంబశివరావు, వరంగల్ బార్ ప్రధాన కార్యదర్శి అనుమాండ్ల రాజ్ కుమార్, హనుమకొండ బార్ అధ్యక్షుడు పూసపల్లి శ్రీనివాస్, జిల్లా నాయకులు పోతన సంధ్యారాణి, బండారి కవిత, జన్ను ప్రభాకర్, కట్కూరి సూరయ్య, జాఘవ, కోటేశ్వరరావు, నదునూరి చంద్రమౌళి, అనిల్, మైదం చంద్రకాంత్, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఇద్దరు పిల్లలతో కలిసి మహిళ అదృశ్యం

- **కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**

మల్కాజిగిరి, సమయం

కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇద్దరు చిన్నారులతో కలిసి ఓ మహిళ అదృశ్యమైన ఘటన కలకలం రేపింది. కాప్రాలోని అరుల్ నగర్ కాలనీకి చెందిన గుండ్ల శ్రీనివాస్ గౌడ్ (55) తన కుమార్తె, ఇద్దరు మనవళ్ల ఆచూకీ తెలియడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు వివరాల ప్రకారం.. శ్రీనివాస్ గౌడ్ కుమార్తె రామారపు శిరీష (29)కు 2019లో దమ్మాయిగూడకు చెందిన సాయికుమార్ గౌడ్ (38)తో వివాహం జరిగింది. వీరికి అయాన్ష్ గౌడ్ (7), రుద్రాక్ష గౌడ్ (4) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. దంపతుల మధ్య కుటుంబ కలహాలు తలెత్తడంతో మూడు నెలల క్రితం శిరీష తన ఇద్దరు పిల్లలతో కలిసి పుట్టింటికి వచ్చి ఉంటోంది.ఈ క్రమంలో నవంబర్ 25వ తేదీ రాత్రి 11 గంటల సమయంలో శిరీష, ఆమె భర్త ఫోన్‌లో మాట్లాడుకుంటూ గొడవపడ్డారు. అనంతరం నవంబర్ 26వ తేదీ ఉదయం 8.15 గంటల సమయంలో తన ఇద్దరు పిల్లలను తీసుకుని



ఇంటి నుంచి బయటకు వెళ్లిన శిరీష తిర.

హాకీ ఛాంపియన్ షిప్ క్రీడలకు లింగారెడ్డి పల్లి యువకుని ఎంపిక..

రాయపోల్ నవంబర్ 26.

హాకీ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఉస్మానియా యూనివర్సిటీ జట్టు కెప్టెన్‌గా సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం లింగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గట్టు నాగరాజు ఎంపికయ్యాడు. 2026-27 సంవత్సరానికి సంబంధించి ఆల్ ఇండియా యూనివర్సిటీస్ ఆఫ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో చెన్నైలో ఈ నెల 28 నుంచి డిసెంబర్ 4 వరకు జరగనున్న సౌత్‌జోన్ పోటీల్లో ఉస్మానియా యూనివర్సిటీ జట్టుకు ఆయన నాయకత్వం వహించనున్నాడు. నాగరాజు గత మూడేళ్లుగా ఉస్మానియా యూనివర్సిటీ హాకీ జట్టుకు



ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. సౌత్‌జోన్ పరిధిలోని వివిధ యూనివర్సిటీల నుంచి ఒక్కో జట్టు ఈ పోటీల్లో పాల్గొననుంది.

రాజ్యాంగ పరిరక్షణకు కాంగ్రెస్ సమరశంఖం

- **'సంవిధాన్ రక్షా మార్చ్'లో పాల్గొన్న ఎంపీ డా.కడియం కావ్య**

వరంగల్, నవంబర్ 26 (సమయం న్యూస్)

రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కాపాడటమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నిర్వహించిన 'సంవిధాన్ రక్షా మార్చ్'లో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ భారీ ర్యాలీ ట్యాంక్‌బండ్‌పై అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్డులోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు సాగింది. తొలుత ఎంపీ కడియం కావ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి స్వేచ్ఛ, సమానత్వం, హక్కులకు భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని, దాని మౌలిక స్ఫూర్తిని బలహీనపరిచే ప్రయత్నాలను ప్రజలంతా ఐక్యంగా తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సామాజిక న్యాయం, సమానత్వ పరిరక్షణకు కాంగ్రెస్ నిరంతరం పోరాడుతుందని, రాజ్యాంగ పరిరక్షణే ప్రజాస్వామ్య పరిరక్షణ అని కడియం కావ్య స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండరెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కేఆర్ నాగరాజు, హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామిరెడ్డి, మాజీ కార్పొరేటర్ మాధవి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం విఫలం...

రాయపోల్ నవంబర్ 26 (సమయం న్యూస్)

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా రైతు వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్నాయని జిల్లా రైతు సంఘం నాయకులు మహేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను ఐకెపి కేంద్రాలకు రైతులు తరలించినప్పటికీ ఇప్పటివరకు కొనుగోలు జరగడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రాజ్యం అంటూ గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వాలు రైతులకు ఓరగబెట్టింది ఏమీ లేదని ఆయన దేశానికి అన్నం పెట్టే రైతన్నకు వ్యవసాయపరంగా అనేక నష్టాలు వస్తున్నప్పటికీ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం గురించి పట్టించుకోపడంలేదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కాంప్లెక్స్ ఎదురుగా ధరలను పెంచి రైతులకు మరింత భారంగా మోపారని. రైతులు యూరియా కోసం వెళ్తే నానో తీసుకుంటేనే ఇస్తామని ఫర్టిలైజర్ వ్యాపారులు తెగేసి చెబుతున్నారని. ఈ విషయంలో జిల్లా వ్యవసాయ అధికారులు



తక్షణమే స్పందించి రైతుల పక్షాన న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కల్తీ ఎరువులు విత్తనాలు. విక్రయిస్తున్న ఫర్టిలైజర్ వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన పేర్కొన్నారు. నెల రోజులు గడుస్తున్నా ఐకెపిలో ఒక్క బస్తా కూడా కొనుగోలు చేయకపోవడం రైతులకు రాత్రి కురిసినటువంటి వర్షం వల్ల తడిసి ముద్దయినటువంటి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు సరిహద్దు గిట్టుబాటు ధరను అందించాలని కోరుతూ కాసుల మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు

ప్రతి ఇంటికి ఆర్థిక భరోసా.. ఇందిరమ్మ కుటుంబ బీమా

- **ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల ఇందిరమ్మ కుటుంబ బీమా పథకం**
- **ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి... బైరి మురళి**

నర్సంపేట, నవంబర్ 26 (సమయం న్యూస్)

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పట్టణ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బైరి మురళి కోరారు. పట్టణంలోని మాదన్నపేట రోడ్డులో ఉన్న సిటిజన్ క్లబ్ ఆవరణలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి అవగాహన, నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. 17, 19, 20, 26 వార్డులకు చెందిన ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకుని బీమా పథకంలో భాగస్వాములు కావాలని సూచించారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం ఎదురైనప్పుడు కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో పడకుండా బీమా సొమ్ము అండగా నిలుస్తుందని, కుటుంబ భద్రతకు ఇలాంటి పథకాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకం వివరాలు తెలుసుకుని, అవకాశాన్ని చేజార్చుకోకుండా దరఖాస్తు చేసుకోవాలని బైరి మురళి విజ్ఞప్తి చేశారు.

ఆత్మరక్షణలో ఆడబిడ్డలకు అక్షరాభ్యాసం

- **అమ్మాయిల భద్రతకు 'రాణి లక్ష్మీబాయి' కవచం..బడుల్లో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ**
- **ప్రభుత్వ పాఠశాలలో కరాటే శిక్షణ తరగతులు ప్రారంభంభించిన 'చిప్ప వెంకటేశ్వర్లు'**

వరంగల్, నవంబర్ 26 (సమయం న్యూస్)

బాలికల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించి, ఆపద సమయాల్లో స్వీయ రక్షణ చేసుకునే లా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో మార్షల్ ఆర్ట్స్ శిక్షణ తరగతులు ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తవాడ గిర్మాజీపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం. భూపాల్, టీపీసీసీ చేనేత విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్ప వెంకటేశ్వర్లు ప్రారంభించారు.202627 విద్యా సంవత్సరంలో 6 నుంచి 9వ తరగతి చదువుతున్న బాలికలకు తెలంగాణ ప్రభుత్వం ఈ శిక్షణ అందిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు, ఎమ్మెల్యే కొండా సురేఖ ఆదేశాల ప్రకారం కుంగ్‌ఫూ (కరాటే)లో శిక్షణ ఇస్తున్నారు. వరంగల్ జిల్లాలోని 103 ప్రభుత్వ పాఠశాలల్లో మూడు నెలల పాటు ఈ కార్యక్రమం కొనసాగనుంది. శిక్షణ ఇచ్చే మాస్టర్లకు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం అందించనున్నారు. ఆత్మరక్షణకు అవసరమైన మెళకువలు, ప్రమాదకర పరిస్థితుల్లో అప్రమత్తంగా వ్యవహరించే విధానాలను బాలికలకు నేర్పించనున్నారు. ఈ శిక్షణతో బాలికల్లో ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు స్వీయ రక్షణ సామర్థ్యం మెరుగుపడుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో పి. బుచ్చిరెడ్డి, సదయ్య, అఫ్సర్, మార్షల్ ఆర్ట్స్ మాస్టర్ ఆర్. కోటేశ్వర్ పాల్గొన్నారు.



భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించిన నవీన ఆదర్శ ప్లే అండ్ హై స్కూల్

కొడంగల్ మున్సిపల్, నవంబర్,26(సమయం న్యూస్)

కొడంగల్ పట్టణంలోని నవీన ఆదర్శ ప్లే అండ్ హై స్కూల్,లో భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల్లో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, దేశభక్తి మరియు పౌర బాధ్యతలపై అవగాహన కల్పించేలా పలు కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉపన్యాస పోటీలు, డ్రాయింగ్ పోటీలు, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. రాజ్యాంగం యొక్క ప్రాముఖ్యత, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలు, దేశ సమైక్యత వంటి అంశాలపై విద్యార్థులు చక్కగా తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు మరియు ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు. విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత, వక్తృత్వ ప్రతిభను వెలికితీయడమే ఇటువంటి కార్యక్రమాల ముఖ్య ఉద్దేశ్యమని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ డా. డి.వి. నరేష్ రాజు, వైస్ ప్రిన్సిపల్ సంతోష పాల్గొని విద్యార్థులను అభినందించారు.రాజ్యాంగం మన దేశానికి మార్గదర్శకమని, ప్రతి విద్యార్థి రాజ్యాంగ విలువలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదగాలని వారు సూచించారు.విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యంతో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు విజయవంతంగా, ఘనంగా ముగిశాయి.



కాంగ్రెస్‌లోకి మొగిలిచెర్ల మహిళలు

- **ఎమ్మెల్యే 'రేవూరి ప్రకాశ్ రెడ్డి' సమక్షంలో పార్టీలో చేరిక**

పరకాల, నవంబర్ 26 (సమయం న్యూస్)

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై మొగిలిచెర్ల గ్రామానికి చెందిన పలువురు మహిళలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పరకాల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో ఈ చేరికలు జరిగాయి.గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 15వ డివిజన్ పరిధిలోని మొగిలిచెర్ల గ్రామానికి చెందిన మహిళలకు ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పాలన, ప్రజలకు అందిస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ఆకర్షితులై స్వచ్ఛందంగా పార్టీలో చేరినట్లు మహిళలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని, ప్రజా సమస్యల పరిష్కారం, డివిజన్ అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ కొండేటి కొమురారెడ్డి, గ్రామ వర్కింగ్ ప్రెసిడెంట్ కొత్తపల్లి స్వామి, 15వ డివిజన్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, పీఏసీఎస్ డైరెక్టర్ అల్లం క్రాంతి, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు కర్రు కుమారస్వామి, ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి జన్యు నరసయ్య, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మెట్టుపల్లి సుమన్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జాతీయ ఆయుష్ మిషన్‌లో 7 పోస్టులకు మెరిట్ జాబితా

ములుగు, నవంబర్ 25:

జాతీయ ఆయుష్ మిషన్‌లో 7 పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రొవిజినల్ మెరిట్ జాబితాను జిల్లా వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా ఆయుష్ నోడల్ అధికారి డా. ఈ. సునీత తెలిపారు. మొత్తం 153 మంది దరఖాస్తు చేసుకున్నారు.మెరిట్ జాబితాపై అభ్యంతరాలను నవంబర్ 27, 28 తేదీల్లో ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆయుష్ విభాగంలో స్వయంగా సమర్పించాలి. గడువు తర్వాత వచ్చిన అభ్యంతరాలను స్వీకరించబోమని తెలిపారు.వివరాలకు: 99084 31655.

JNVST పరీక్షలు జరిగే పరీక్ష కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలి..

- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

వికారాబాద్,నవంబర్,26(సమయం న్యూస్)

వికారాబాద్ జిల్లా JNVST పరీక్షలు (జవహర్ నవోదయ విద్యాలయ సెలక్షన్ టెస్ట్) 28.11.2026 న జరిగే పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన చర్యలు తీసుకోవాలి ...ఈ నెల 28న నవోదయ ప్రవేశ పరీక్షకు - అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలనీ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న జవహర్ నవోదయ విద్యాలయ 6వ తరగతి ప్రవేశ పరీక్షకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశించారు.పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షా కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించనున్నారు.ముఖ్యంగా తాగునీటి సౌకర్యం, వైద్య సదుపాయాలు, ప్రథమ చికిత్స కేంద్రం, పరిశుభ్రమైన వాతావరణం, అవసరమైన ఫర్నిచర్ తదితర ఏర్పాట్లు చేయనున్నారు.విద్యార్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల్లో తాగునీరు అందుబాటులో ఉంచడంతో పాటు, అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలు అందించేందుకు మెడికల్ సిబ్బందిని అందుబాటులో ఉంచనున్నారు. పరీక్ష సజావుగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థులు ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని, హాల్‌టికెట్ తప్పనిసరిగా వెంట తీసుకురావాలని సూచించారు.జిల్లా లో పరీక్షా కేంద్రాలు మొత్తం 9 సెంటర్లు



మండలం సెంటర్ పేరు n విద్యార్థులు పరిగి ZPHS (బాలికలు), పోస్ట్ ఆఫీస్ పక్కన, పరిగి240
పరిగి జిల్లా పరిషత్ హై స్కూల్ నెం.1, పరిగ181
తాండూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (GJC), తాండూర్ 192
తాండూర్ న్యూ సలంద హై స్కూల్, సైపూర్, తాండూర్ 115
వికారాబాద్ZPHS (బాలురు), వికారాబాద్ 216
వికారాబాద్ ZPHS (బాలికలు), BSNL ఆఫీస్ పక్కన, వికారాబాద్ 216
వికారాబాద్ ZPHS (బాలురు) ఆలంపల్లి, మోమిన్‌పేట్ రోడ్216
వికారాబాద్ZPHS శివారెడ్డిపేట్, హైదరాబాద్ రోడ్198
మర్పల్లిTS మోడల్ స్కూల్, మర్పల్లి 82

నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, IPS





నవాబ్ పేట మండలం, నవంబర్,26(సమయం న్యూస్)

పోలీస్ స్టేషన్ల పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టే లక్ష్యంతో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, IPS గురువారం నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, రిసెప్షన్ కౌంటర్, వివిధ రికార్డులు, స్టేషన్ నిర్వహణ, పెండింగ్ కేసుల వివరాలు, నమోదైన కేసుల పురోగతిని ఎస్పీ పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ముఖ్యంగా NDPS (మాదకద్రవ్యాల నియంత్రణ) కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి మరియు ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడే వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మత్తు పదార్థాల సరఫరా గొలుసును గుర్తించేందుకు సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సూచించారు.అలాగే దొంగతనం కేసుల నియంత్రణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, పాత నేరస్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, పెండింగ్‌లో ఉన్న దొంగతనం కేసులను ప్రత్యేకంగా పర్యవేక్షిస్తూ నిందితులను త్వరితగతిన గుర్తించి కేసులను ఛేదించాలని ఆదేశించారు. రాత్రి గస్తీ, వాహనాల తనిఖీలు, అనుమానితుల కదలికలపై నిఘాను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై మాట్లాడుతూ, CCTNS వ్యవస్థలో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, FIR నమోదు నుంచి కేసు దర్యాప్తు పూర్తయ్యే వరకు ప్రతి దశలో ఆన్‌లైన్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. eSakshya యాప్ ద్వారా నేర స్థలంలో లభించే భౌతిక, డిజిటల్ ఆధారాలను నిబంధనల ప్రకారం ఫోటోలు,వీడియోల రూపంలో సేకరించి భద్రపరచాలని ఆదేశించారు.అదేవిధంగా ICJS, eSummons వంటి డిజిటల్ వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగిస్తూ, కోర్టు సంబంధిత ప్రక్రియలను వేగవంతం చేయాలని తెలిపారు. పెండింగ్ కేసుల వివరాలు, కేసుల పురోగతి, దర్యాప్తు నివేదికలను ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, డిజిటల్ రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని స్పష్టం చేశారు.సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ సీసీటీవీ కెమెరాల ద్వారా నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా ఆధారాలను పకడ్బందీగా సేకరించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో పరిశుభ్రత, క్రమశిక్షణ, రికార్డుల నిర్వహణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ డీఎస్పీ అంజయ్య, మోమిన్‌పేట్ సీఐ వెంకట్, నవాబ్ పేట్ ఎస్సై గిరి, ఇతర పోలీస్ అధికారులు

డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలి





- **ప్రహరీ క్లబ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి – డీఈఓ డాక్టర్ ఎం. గోవిందరాజు**
- **డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్ – స్కూల్ ఎడ్యుకేషన్ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణ**

నారాయణపేట, నవంబర్ 26(సమయం న్యూస్)

విద్యార్థులు మాదక ద్రవ్యాల వినియోగానికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ పిలుపునిచ్చారు.విద్యార్థులు తమ ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.తెలంగాణ ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో "ప్రహరి - యువ సురక్ష" కార్యక్రమంలో భాగంగా, "అవగాహన గల మనసులు, దృఢ నిర్ణయాలు, మత్తు రహిత పాఠశాలలు" అనే నినాదంతో జిల్లా స్థాయి అవగాహన కార్యక్రమం గురువారం నారాయణపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల వినియోగం విద్యార్థుల ఆరోగ్యంతో పాటు వారి విద్యాభ్యాసం, భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టి సారించాలని సూచించారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో విద్యార్థులు చైతన్యవంతులుగా మారి, తమ తోటి విద్యార్థులకు కూడా అవగాహన కల్పించాలని పిలుపునిచ్చారు.ప్రహరీ క్లబ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలి - డీఈఓ డాక్టర్ ఎం. గోవిందరాజుజిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం. గోవిందరాజు మాట్లాడుతూ, విద్యార్థుల్లో మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించేందుకు పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. ప్రహరీ క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కల్పిస్తూ, వారిని మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా చైతన్యపరచాలని తెలిపారు.ఈ నెల 28.11.2026న అన్ని మండలాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ, ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలల ఉపాధ్యాయులకు మాదక ద్రవ్యాల దుర్వినియోగ నిరోధకంపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని డీఈఓ సూచించారు. శిక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి,ఉపాధ్యాయుల ద్వారా విద్యార్థుల్లో విస్తృత అవగాహన కల్పించాలని తెలిపారు.అలాగే, ఈ నెల 30వ తేదీన జిల్లా పరిధిలోని అన్ని మేనేజ్‌మెంట్లకు చెందిన పాఠశాలలు, కళాశాలల్లో మాదక ద్రవ్యాల దుర్వినియోగ నిరోధక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. నిర్వహించిన కార్యక్రమాల వివరాలను సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. మత్తు పదార్థాల దుర్వినియోగంపై అవగాహన కల్పించిన డీఎంహెచ్ఓ డాక్టర్ కేజేసీ మోహన్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కేజేసీ మోహన్ మాట్లాడుతూ, మత్తు పదార్థాల దుర్వినియోగం వల్ల కలిగే ఆరోగ్యపరమైన అనర్థాలు, శారీరక, మానసిక సమస్యలపై అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాల వినియోగం వ్యక్తి ఆరోగ్యంతో పాటు కుటుంబం, సమాజంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందని వివరించారు. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు.డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్ - స్కూల్ ఎడ్యుకేషన్ ఇయర్ క్యాలెండర్ ఆవిష్కరణఈ కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ ఫ్రీ క్యాంపస్ - స్కూల్ ఎడ్యుకేషన్ ఇయర్ క్యాలెండర్‌ను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎం. గోవిందరాజు తదితర అధికారులు ఆవిష్కరించారు.పాఠశాలలు, కళాశాలల్లో ఏడాది పొడవునా మాదక ద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ఈ క్యాలెండర్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో పాల్గొన్న అధికారులుఈ కార్యక్రమంలో ఎస్‌డీపీఓ లింగయ్య, ట్రైనీ డీఎస్పీలు, ఎస్ఐ వెంకటేశ్వర్లు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కేజేసీ మోహన్, ఏఎంఓ విద్యాసాగర్, సీఎంఓ రాజేంద్ర కుమార్, జిల్లా సైన్స్ అధికారి భానుప్రకాష్, నషా ముక్త్ భారత్ కార్యక్రమం విద్యాశాఖ నోడల్ అధికారి ఆర్. అంజనేయులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.ప్రతి మండలం నుండి ఒక మండల విద్యాధికారి, ఒక రిసోర్స్ టీచర్, ఒక విద్యార్థి పాల్గొనగా, ప్రభుత్వ జూనియర్ కళాశాలల నుండి ఒక రిసోర్స్ లెక్చరర్ హాజరయ్యారు.రాజ్యాంగ దినోత్సవంఅదేవిధంగా, రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించి, విద్యార్థులతో భారత రాజ్యాంగ పీఠికను పఠనం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి - ఆరోగ్యకరమైన జీవితాన్ని ఎంచుకోండి - మత్తు రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కండి.